

కొత్తపల్లి

నవంబరు 2014 వెల; 25 రూ.





సంపుటి:1 సంచిక: 1 పుటలు: 68 విడి ప్రతి వెల: 25 రూ. నవంబరు 2014

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702677670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhrapradesh
Phone: 08662579129

Title Verified By RNI
APTEL/14249/01/1/2014-TC

సంపాదకులు: నారాయణ శర్మ

గౌరవ సలహాదారు: యు. సుబ్బరాజు

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

సహకారం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

వీరాంజనేయులు: 7799260684

అడవి రాముడు: 9491870753

ఫైనార్ట్స్ చదువుతున్న ఇతర మిత్రులు కూడా.


వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

కె. మల్లికార్జున: 9000453887

విషయ సూచిక



ముఖచిత్రం: ప్రింటర్ గాంధీ

చిత్రకారుడు: వీరాంజనేయులు

పట్టుదల

జాన్ గుటెన్‌బర్గ్ ముద్రణ యంత్రాన్ని కనుగొనక ముందు, ప్రపంచంలో పుస్తకాలన్నిటినీ చేత్తోటే రాయాల్సి వచ్చేది. పెద్ద పెద్ద రాజులు, చక్రవర్తులు తమకు నచ్చిన గ్రంథాలను 'వ్రాయసగాళ్ళ' చేత చేత్తో రాయించి, ఆ వ్రాత ప్రతుల్నే తమకు నచ్చిన వాళ్ళకు బహుమతులుగా ఇస్తుండేవాళ్ళు. అయితే ఒకసారి ముద్రణ యంత్రాలు తయారవ్వటం మొదలెట్టాక, అవి ఇంక అన్ని దేశాలలోకీ మెరుపువేగంతో చొచ్చుకొని పోయాయి.



దక్షిణాఫ్రికాలో గాంధీగారు పౌరహక్కుల కోసం గొడవ మొదలుపెట్టాక, అక్కడి 'భారతీయుల్ని ఒక్క త్రాటి మీదికి తేవటం ఎలాగ' అని ఆలోచించి, చివరికి 'ఇండియన్ ఓపీనియన్' అని ఓ పత్రికను మెదలెట్టారు. దానికి సంపాదకుడు, ప్రచురణ కర్తా రెండూ గాంధీగారే. అయితే అది పూర్తిగా నష్టాల ఊబిలో కూరుకుపోయి ఉండేది. కొంతకాలం దాన్ని పైకి లాగేందుకు ప్రయత్నించిన తర్వాత గాంధీ గారికి అర్థమైంది- "పట్నంలో ఖర్చులెక్కువ- ఇక్కడ ఉంచి నడిపి, దాన్ని కాపాడే అవకాశం ఇంక లేదు" అని.

ఆ సమయానికి గాంధీగారి మిత్రులంతా కలిసి జోహాన్నెస్‌బర్గులో 'ఫీనిక్స్ ఆశ్రమం' అని ఒకదాన్ని నడిపించేవాళ్ళు: రోడ్డుకి దూరంగా, ఎక్కడో విసిరేసినట్లు ఉండేదది! తన ప్రెస్సును అక్కడికి తీసుకెళ్లాలనుకున్నాడు గాంధీ. అక్కడ ప్రెస్సుకు అవసరమైన కరెంటు లేదు;

రవాణా సౌకర్యాలు అంతగాలేవు- దాంతో తెలిసిన వాళ్లంతా 'వద్దు' అన్నారు. 'అక్కడికి వెళ్తే శ్రమ మరింత ఎక్కువౌతుందమ్మా' అని చిలక్కి చెప్పినట్లు చెప్పారు.

'శ్రమ ఎక్కువైనా పర్లేదు- ఖర్చు మాత్రం తగ్గాలి' అన్నాడు గాంధీ. వాస్తవ పరిస్థితి కూడా అదే మరి! సరే, ఇంకేం చేస్తారు? అంతా కలిసి పట్నంలో ఉన్న ముద్రణశాలను, అందులోని యంత్రాలు- ఫర్నిచర్‌తో సహా- రవాణా చేసి, ఫీనిక్స్ ఆశ్రమంలో ఓ షెడ్డుకు చేర్చారు. ప్రెస్సును నడిపేందుకు ఓ పెద్ద ఆయిల్ ఇంజనును తీసుకొచ్చారు. దాన్ని ఆనుకొనే, మరో గదిలో గాంధీగారి ఆఫీసు.



ఆ శనివారం నాడు 'ఇండియన్ ఒపీనియన్'ను పోస్టు చేయాల్సి ఉందనగా, శుక్రవారం మధ్యాహ్నానికి గానీ ప్రెస్సులో అక్షరాలు కూర్చటం అవ్వలేదు. ఇక అటుపైన ఆశ్రమంలో ఉన్నవాళ్లు- ముసలీ, ముతకా, పిల్లా-పెద్ద, ఆడ-మగ అంతా పనిలోకి దిగారు. కొందరు అక్షరాలు సవరించే పని, కొందరు ముద్రించే పని- కొందరు కాయితాలను సైజుకి కత్తిరించే పని, పుస్తకాలు పిన్ చేసి, మడిచే పని, మరికొందరు అడ్రసులు రాసే పని, కొందరు మూటలు కట్టే పని- శుక్రవారం రాత్రంతా పని చేశారు అందరూ.

అనుకున్నట్లుగానే, అక్కడ ముద్రణ కూడా ఏమంత సులభంగా జరగలేదు. ఆ రోజునే ఆయిల్ ఇంజన్ పాడైంది. ఎవరు ఏం చేసినా అది నడవలేదు! దాంతో గాంధీ గారితో పాటు మరికొందరు బలం ఉన్నవాళ్ళు దాని చక్రాన్ని చెరుకురసం యంత్రాన్ని త్రిప్పినట్లు రాత్రంతా

చేతులతో తిప్పుతూ ముద్రణ కొనసాగించారు!

ఇట్లా పని చేసిన వీళ్లెవరూ పత్రిక ఉద్యోగులు కారు; ఎవ్వరికీ జీతాలు లేవు! అయినా అంతా శ్రమించారు; రైలు వచ్చే సమయానికి సంచీలను రైల్వే స్టేషనుకు చేర్చారు! ఆ వారమే కాదు, తర్వాత ప్రతి వారమూ అదే పనైంది: ప్రతి శుక్రవారమూ గాంధీ గారికి జాగరణ అయ్యింది.

గాంధీగారు ఇంగ్లాండు చేరాక కూడా దక్షిణాఫ్రికా కష్టాలను మర్చిపోలేదు. ఉత్తరం రాశారు- "ఆశ్రమంలో ఉన్న ఆడవాళ్లంతా రోజూ 'ఫీనిక్స్ ప్రెస్'కి వెళ్తున్నారని ఆశిస్తాను- కనీసం శనివారం నాడైతే వెళ్తున్నారుగా? ఆదివారం నాడు పత్రికని మార్కెట్లో అందించాలి!" అని.

తర్వాత మన దేశానికి వచ్చేశాక, మరో మూడు పత్రికలు నడిపారు గాంధీగారు: 'యంగ్ ఇండియా', 'నవ జీవన్', 'హరిజన్'- ఈ మూడు పత్రికలూ ఇదే తరహాలో నడిచాయి!

ఇంత కష్టపడి పత్రికలు ఎందుకు నడపాలి?

"అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలువరించాలంటే, అవి వక్రీకరింపబడకుండా ఉండాలంటే, పత్రికలను మనకి మనం నడిపించుకోవాల్సిందే! లేకపోతే కుదరదు. అవకాశం ఉంది కాబట్టి ముద్రణ శాలను వాడాం. అలాంటి అవకాశమే గనక లేకపోతే ఏం చేసేవాడిని, అన్నిటినీ వేటికవి చేత్తో రాయించి ఉండే వాడిని!" అన్నారు గాంధీగారు. అవసరమయ్యింటే నిజంగానే అంత పనీ చేయించి ఉండేవాడు పెద్దాయన!

ఈ మాసం నుండీ కొత్తపల్లి అధికారికంగా పత్రికల ప్రపంచంలో చేరనున్నది. రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఇండియా వారు కొత్తపల్లిని తెలుగు మాస పత్రికగా గుర్తించటంతో కొత్త *కొత్తపల్లి ఒకటో సంచిక*- రకరకాల, మార్పులతో ఇదిగో, ఇలా మీ ముందుకొస్తున్నది.

ఎప్పటిలాగే ఆదరిస్తారని ఆశిస్తూ-

కొత్తపల్లి బృందం



నీతిచంద్రిక

సంధి-7

జరిగిన కథ: కోతి నదిలోకి విసిరే మేడిపళ్లకు అలవాటు పడింది 'క్రకచం' అనే ఓ మొసలి. ఆ కోతితో స్నేహం చేసుకొని, ముచ్చట్లు పెట్టుకుంటూ అక్కడే ఉండిపోయిందది. మొసలి భార్య పంపిన దాసి ఒకతె దాన్ని చూసి వెళ్ళి 'నీ భర్త ఓ ఆడకోతితో స్నేహం చేస్తున్నాడమ్మా' అని చల్లగా చెప్పింది. ఇక చదవండి- నీతి చంద్రిక 54 వ భాగం..

మూలం: కీ.శే.కందుకూరి వీరేశలింగం *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

ఆ సంగతి తెలియగానే మొసలి భార్యకు ఒళ్ళు ఝుల్లుమన్నది. అది కొంచెంసేపు మూర్ఛపోయి, తేరుకున్నది. తర్వాత భర్తమీద కారాలు మిరియాలూ నూరుతూ, ఒళ్ళు మండుతూంటే ఏంచేయాలో తోచక, పచార్లు చేస్తూ కూర్చున్నది.

ఇక అక్కడ క్రకచం కూడా చూసింది: చెలికత్తె తన దగ్గరికి రావటం, కొంతసేపు ఉండటం, తనతో ఏమీ మాటలాడకనే వెనక్కి తిరిగి పోవటం! "అది ఇంటికి వెళ్ళి తనమీద భార్యకు ఏమేం చెబుతుందో" అని దాని గుండెలు తటతటా కొట్టుకున్నాయి. ఇంక దానికి అక్కడ కాలు నిలువలేదు- త్వరత్వరగా కోతికి వీడ్కోలు చెప్పి, 'ఇంటికి

వెళ్ళేటప్పుడు ఖాళీ చేతులతో పోరాదు' అని, భార్యకు బహుమతిగా ఇచ్చేందుకు బాగా పండిన కొన్ని మేడిపండ్లను కూడా ఏరుకొని, హుటాహుటిన ఇల్లు చేరుకున్నదది.



అయితే ఆ సరికే దాని భార్యకు అది వస్తున్న సంగతి తెలిసిపోయింది. క్రకచం వచ్చేసరికి అది పడుకుంటే, చెలికత్తెలు దాని చుట్టూ చేరి దొంగ ఏడుపులు ఏడుస్తూ కూర్చొని ఉన్నాయి.

ఆ స్థితిలో భార్యను పలకరించింది క్రచకం. జవాబు రాలేదు. అది తత్తరపాటున "ఇదేంటి? ఏమైంది?" అని చెలికత్తెలను అడిగింది.

అప్పుడు ఆ స్నేహితురాళ్ళంతా కూడబలుక్కున్నట్లు "ఏం చెప్పాలి? నువ్వు 'పోయిందే పోక' అన్నట్లు పోయావు; 'ఇంట్లో భార్యకు ఏమైనా సరే' అనుకున్నావు; నెల నాళ్ళ నుండి యీా ఇంటికేసి తొంగి కూడా చూడలేదు. నువ్వు వెళ్ళిన తరువాతి రోజునుండే నీ భార్యకు తీరని రోగం ఒకటి పట్టుకున్నది; రోజు రోజుకూ ఆ రోగం ప్రబలి, ఇవాళ్ళ ఉదయం నుండి దాని మాట కూడా పడిపోయింది. ఆ రోగం మొదలైన నాటి నుండి మేమందరం రాత్రనక, పగలనక తిరిగాం; కనబడ్డవారి కాళ్ళన్నీ పట్టుకున్నాం; అయ్యే ఖర్చుకు వెనుక-ముందు చూడక, మేం మాకు చేతనైన సిద్ధ ఔషధాలను అన్నిటినీ-పోయించాం. పోసిన మందులన్నీ ఎటు పోయినాయో గాని, రోగం మాత్రం కొంచెం కూడా తగ్గలేదు. ఆడవాళ్ళం, ఇంతకంటే ఏం చేయగలం?

విసిగి పోయిన వైద్యులు చివరికి ఒక చికిత్స

చెప్పారు: కోతి గుండెను సంపాదించి తెచ్చి, దాన్ని పాలతో పాటు నాలుగు రోజులు-రోజూ సాయంత్రం పూట- సేవిస్తే, రోగం పోయి ఈమె సంపూర్ణంగా ఆరోగ్యవంతురాలవుతుంది-

లేకపోతే ఇక ఆమె జీవితం పై ఆశలు వదులుకోవాల్సిందే! 'చెడగా, చెడగా కాపురాలు కావు'- మేం చెప్పాల్సింది చెప్పాం; ఇంక ఏ పాట్లు పడతావో , ఎలా నీ భార్యను బ్రతికించుకుంటావో, నీ ఇష్టం- " అన్నాయి.



క్రకచం కొంతసేపు నివ్వెరపోయి నిలబడి, ఆకాశం వైపుకు చూసి, రకరకాలుగా ఆలోచించి, తల ఊపి, ఏ విధంగా ఐనా సరే, 'పోక తప్పదు' అని నిశ్చయించుకొని, వాళ్ళ ముందు ఇక నోరు మెదల్పలేక, వెనక్కి బయలుదేరింది. పోతూ పోతూ ఆలోచించింది: "ఇంట్లో చూస్తే ఈమెది 'వచ్చే ప్రాణం- పోయే ప్రాణం' అన్నట్లున్నది. వైద్యులేమో అసాధ్యమైన వైద్యం చెప్పారు. 'సాధ్యమే' అనుకుంటే మరి- స్నేహితుడిని చంపుకోవాల్సి రావచ్చు- బలవర్ధనం కాక, ఇక నాకు మరో కోతి చిక్కదు కదా? ఇక వేరే వానర హృదయాన్ని ఎక్కడనుండి తెచ్చి ఇవ్వగలను? ఇవ్వలేదనుకో- ఇంతటి అవస్థలో ఉన్న భార్యను, మందు వేయకుండా బలవంతంగా ఎట్లా చంపుకోను?

భార్యకోసం మిత్రద్రోహం చేయ్యటం న్యాయమా? కాదని ఊరుకొంటే నిష్కారణంగా పండంటి కాపురం కూలిపోతున్నదే! 'మిత్రుడిని చంపటం' అన్నది అన్ని అన్ని చెడ్డపనులలోకీ చెడ్డది- నిజమే, కానీ 'భార్య అన్నది నా ఆత్మలో సగం కదా!' అందువల్ల భార్యను కోల్పోవటం అన్నది ఆత్మవధ కంటే కూడా పాప కార్యం. లోకంలో 'తనను

మాలిన ధర్మంలేదు' అంటారు కదా! జాగ్రత్తగా ఆలోచిస్తే, స్నేహితుడి ప్రాణాలు తీసి అయినా సరే, భార్య ప్రాణాలు కాపాడుకొని ఇంటిని నిలబెట్టుకోవటం సరైన పని అని తోస్తున్నది" అని, కోతిని చంపేందుకే నిశ్చయించుకున్నది.

అయినా పది అడుగులు ముందుకు వేయగానే అంతటి పాపానికి ఒడిగట్టుతున్నందుకు దానికి మనసొప్పలేదు. ఆ ఊగిసలాటలో దానికి కళ్ళు తిరిగినట్లయి, కొంత సేపు నిశ్చేష్టమై నిలిచి ఉండిపోయింది. చివరికి 'పాపమే కానియ్యి' అని నిశ్చయానికి వచ్చి, "బలవర్ధనుడిని చంపాల్సిందే, తప్పదు" అనుకుంటూ మేడిచెట్టు దగ్గరికి పోయింది.

అట్లా వేగంగా తిరిగి వచ్చిన మొసలిని చూసి కోతి ఆశ్చర్యపోతూ "మిత్రమా, ఆశ్చర్యం! భార్యని చూడాలని అంత ఉత్సాహంగా వెళ్ళావు కదా, వెళ్ళి ఇంకా గంట కూడా కాలేదు- అంతలోనే మళ్ళీ తిరిగి వచ్చేశావెందుకు, ఏమైంది?" అని అడిగింది.

అప్పుడా మొసలి 'హిహిహి ' అని నవ్వుతూ- 'నీ అనుమతితో మా ఇంటికి వెళ్ళి, నా భార్యను చూసి, ఆమె కోసం నువ్వు అంత ఇష్టంగా ఇచ్చిన మేడిపళ్ళను అందించానా!? దాంతో మా ఆవిడ పొంగిపోయింది. చటుక్కున కొన్ని పళ్ళు నోట్లో వేసుకొని, వాటి రుచికి నివ్వెరపోయింది!

వెంటనే మొదలు పెట్టింది: "నీకు ఈ పండ్లు ఎక్కడివి? ఇంత చక్కని పండ్లను నీకిచ్చిన ఆ పుణ్యాత్ముడు ఎవ్వడు, చెప్పు!" అన్నది.

నేను చెప్పాను: "తపతి ఒడ్డున ఓ మేడి చెట్టు ఉన్నది. దానిమీద 'బలవర్ధనం' అనే కోతి రాజు ఒకడున్నాడు. అతను గొప్ప స్నేహశీలి; దయగలవాడు. ఆ కోతిరాజు ఆదరణలో సమస్తమూ మరచి, అతనిచ్చే ఈ పళ్ళ తీపిని వదిలి రాలేక, ఇంతవరకూ అక్కడే ఉండిపోయాను.

ఆ మహానుభావుడు నాకు మెల్లగా సర్ది చెప్పి, వీడ్కోలిచ్చి, అమృతంతో సమానం అయిన యీ గొప్ప ఫలాలను ఇచ్చి, నన్ను నీ వద్దకు సాగనంపాడు కాబట్టి ఇప్పుడైనా వచ్చాను" అంటూ నీ ఉపకారాలను,

మంచితనాన్ని వెయ్యి నోళ్ళ కొనియాడాను.

నీ చెల్లెలు అప్పుడు నా మీదే కోపగించుకున్నది- "అయ్యో పనికి మాలినవాడా! కృతఘ్నుడా! అంత మంచి మనసుగల ఆ కోతి రాజును నీతో కూడా మన భవనానికి వెంటబెట్టుకొని వచ్చి, మన పాలిటి దైవం మాదిరి పూజిస్తే, కనీసం మన జన్మ అయినా సఫలమయ్యేది కదా?! అంత చిన్న పనీ రాక, ఆ మహానుభావుడిని ఒంటరిగా ఆ మొండి చెట్టుమీద దిగవిడిచి వచ్చేస్తావా?!



ఇప్పుడిక మళ్ళీ పో! పోయి, కోతి జాతికే తలమానికమైన ఆ కోతిరాజును- నా మనవిగా విన్నవించుకొని- ఇక్కడికి తీసుకురా! అంతవరకూ నాతో మాట్లాడకు!" అని నన్ను ఇక్కడికి త్రిప్పి పంపింది.

ఇప్పుడింక నువ్వు ఆలస్యం చెయ్యకు- నా ప్రార్థనను అంగీకరించి, వెంటనే మా యింటికి దయ చెయ్యాలి- తప్పదు, రా పోదాం" అని ఆ దుర్మార్గపు మొసలి తెచ్చిపెట్టుకున్న ప్రేమతో తొందరపెట్టింది.

అప్పుడా కోతి మిత్రుడి మాటకు ఎదురు చెప్పలేక, "క్రకచా! నీ ఇల్లు నాకేమైనా పరాయి ఇల్లా? నీ ఇంటికి వచ్చి మీరు చేసే సత్కారాలను పొందేందుకు నాకు ఏం అడ్డం?! అయినా కేవలం ఒక్కటంటే ఒక్క సమస్య కనిపిస్తున్నది- నేను చెట్లపైన బ్రతికే ప్రాణిని- చెట్లమీద, నేలమీద బ్రతుకగల్గుతాను తప్ప, మీరుండే నీటి మడుగుల్లో ఉండలేను కదా?! ఇంక మీ ఇంటికి ఎట్లా రమ్మంటావో చెప్పు?!" అన్నది.

"అంతమాత్రం ఆలోచించకుండానే నిన్ను పిలుచుకొని పోతానా, మా ఇల్లు నువ్వు

రాలేని చోటు కాదు. మేం ఉండేది ఈ చెరువు అవతల ఉన్న లంక మధ్యలోని ఓ సుందర మందిరంలో. దాని చుట్టూ పండ్ల చెట్లు అనేకం ఉన్నాయి. ఆ దీవి అందాన్ని ఏమని వర్ణించను? అది నిజంగా భూతల స్వర్గమే. నువ్వు నాతో వచ్చి, రేపు-మర్నాడు రెండు రోజులూ మా ఇంట్లో ఉండి, మా సేవలు స్వీకరిస్తూ, ఇష్టం వచ్చినప్పుడల్లా ఆ తోటలో విహరిస్తూ ఉండవచ్చు.



దారిలో కూడా నీకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిన్ను నా వీపు మీద ఎక్కించుకొని, చిటికెలో మా ఇంటికి చేరుస్తాను.

అక్కడ నీ చెల్లెలు నీ మీది ప్రేమతో ఏరి కోరి సేకరించిన కాయగూరలతో వండిన వంటలన్నిటినీ నీకు కానుక చేస్తాను. నీ చెల్లెలు మన రాక కోసం ఎదురు చూస్తుంటుంది. త్వరగా బయలుదేరు-పోదాం" అని తొందర పెట్టింది క్రకచం.

దాంతో ఇక కాదనలేక, చెట్టుమీదినుండి దిగి, క్రకచం వీపు పైకెక్కి కూర్చున్నది బలవర్థనం. అది అట్లా కూర్చోగానే మొసలి కాస్తా చెరువులో ఈదటం మొదలు పెట్టింది. దారిలో అంతా "అయ్యయ్యో! ఎంత ఘోరమైన పని చేస్తున్నాను?! ఒక్క ఆడదాని కోసం ఇంత మంచి స్నేహితుడిని మోసం చేసి పాపం మూట గట్టుకుంటున్నానే?! ఇంక నా గతి ఏమౌతుందో తెలీదు.

నావంటి దుర్మార్గులు అసలు ఎక్కడైనా ఉంటారా?! దేవుడా, ఇక నేను ఎలాంటి నిందల్ని ఎదుర్కోనాల్సి వస్తుందో, ఏమో" అని తనలో తాను అనుకుంటూ, చిన్నబోయిన ముఖంతో ముందుకు సాగిందది.

దాని ముఖ కవళికలను గమనించిన కోతి, కొంచెంగా అనుమానిస్తూనే- "మిత్రమా! ఇప్పుడు నీ ముఖం మరో విధంగా అనిపిస్తున్నది. ఇంతకు ముందున్న ఉత్సాహం ఇప్పుడు నీలో కనిపించటం లేదు. నీ మనసు ఏదో ఆలోచనకు బందీ అయి, ఏదో తత్తరపాటుకు గురవుతున్నట్లున్నది.

శరీరాలు 'మనోవ్యాధికి, రోగానికి, ముసలితనానికి ఆలవాలాలు' అని పెద్దలు చెబుతారు. ఇంట్లో నా చెల్లెలు బాగానే ఉన్నది కదా?!" అని అడిగింది మొసలిని.

(ఇక మొసలి ఏమన్నదో మళ్ళీ చూద్దాం....)

టీచర్: వెంగళప్ప! నీ కాళ్ళ చూసుకున్నావా? ఒక కాలుకు ఎర్రబూటు, ఇంకో కాలుకు నల్ల బూటు వేసుకొచ్చావు?!

వెంగళప్ప: అదే నా బాధ టీచర్! ఇట్లాంటిదే మరో జత కూడా ఉంది నా దగ్గర!

టీచర్: పిల్లలూ! ఎందుకర్రా మీరు అంతమట్టి గొట్టుకుంటారు. సాయంత్రం కల్లా? నేను చూడండి ఎలా శుభ్రంగా ఉంటానో!

పిల్లలు: మీకంటే మేం భూమికి దగ్గరగా ఉంటాం కద టీచర్!

పేషంట్: డాక్టరు గారు, నా ప్రక్కన కూర్చున్నది చూడండి, మా యీ చెల్లెలికి ఓ వింత రోగం ఉన్నదండి. తను అదృశ్య రూపంలో ఉన్నదని తన ఊహ.

డాక్టర్: ఏ చెల్లెలు? ఎక్కడ కూర్చున్నది?!

పేషంట్: డాక్టరు గారూ, నాకెందుకో, మరి 'నేనే దేవుడు' అనిపిస్తున్నదండి.

డాక్టర్: అవునా? ఎప్పటినుండి?

పేషంట్: నేను మొదటి సూర్యుడిని సృష్టించాను చూడండి, అప్పటినుండి.

పేషంట్: డాక్టరు గారు, నా జుట్టు బాగా రాలిపోతోంది. దానికేమన్నా కావాలి.

డాక్టరు వెంగళప్ప: అగ్గిపెట్టె సరిపోతుందా, లేకపోతే ఖాళీ స్వీటు డబ్బా కావాలా?



రెండు ప్రమాదాల కథ

దీపావళి టపాకాయలు అనుకోకుండా పేలితే పెద్ద ప్రమాదాలవ్వొచ్చు! జాగ్రత్తగా ఉండాలి అందరమూ !
రచన: బాపిరెడ్డి, 9 వ తరగతి, జాస్మిన్, అరవింద స్కూలు, కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

రెండు సంవత్సరాల క్రితం, ఓసారి వేసవి సెలవులొచ్చాయి. మరి నాకేమో వేసవి సెలవులంటే ఎంతో ఇష్టం. ఎందుకంటే, సెలవులొచ్చాయంటే చాలు- మేం మా బాబాయిగారి ఇంటికి వెళ్తాము. వాళ్ళు విశాఖపట్నంలో ఉంటారు. వాళ్ళింటికి వెళ్తే సముద్రం, స్టీల్ ప్లాంటు అన్నీ చూడచ్చు. బలే సరదాగా ఉంటుంది. అట్లా ఆ ఏడాది కూడా మా బాబాయిగారి ఇంటికి వెళ్ళాం.

అంతకు కొద్ది రోజుల ముందే మా బాబాయి వాళ్ళు కొత్తగా కారు ఒకటి కొనుక్కున్నారు. మాకందరికీ దాన్ని చూస్తే చాలా మోజుగా ఉండేది. మరో రెండు రోజులు గడిచాక ఆ అవకాశం వచ్చింది- మా బాబాయి, నేను, మా తమ్ముడు కారులో షాపింగుకి వెళ్ళి ఏవేవో చాలా సామాన్లు కొనుక్కున్నాం! అయితే ఆ పనులన్నీ పూర్తయ్యే సరికి చీకటి పడింది. బాబాయిదేమో అంతగా అలవాటు

లేని డ్రయివింగు! ఎదురుగుండా వచ్చే వాహనాల లైట్లవల్ల కళ్ళు మిరుమిట్లు గొల్పుతుంటే, కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకొని, కళ్ళు చికిలించుకొని చూస్తూ నడపటం మొదలుపెట్టాడు. చివరికి ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్ ఒకదాన్ని తప్పించబోయి రోడ్డు ప్రక్కనే ఉన్న చెట్టుకు గుద్దేశాడు కారును!



అందరూ చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు; కానీ నా కాలుకు మాత్రం గట్టి దెబ్బే తగిలింది. డాక్టర్ గారి దగ్గరకు వెళితే ఐదు నెలలు విశ్రాంతి తీసుకోమన్నారు. ఇక దాంతో నా బడి కూడా హుష్ కాకీ అయ్యింది. నన్ను అక్కడే వదిలేసి మా అమ్మావాళ్ళంతా మా ఊరికి వెళ్ళిపోయారు. నా కారు మోజు అట్లా వదిలిపోయింది.

సరే అది అట్లా అయ్యిందా, ఊరికే పడుకొని, ఏవో పుస్తకాలు చదువుకుంటూ ఎలాగో నెలలు గడిపాను. మెల్లగా నా కాలు కూడా బాగైంది. ఇంకా కొద్ది రోజుల్లో దీపావళి పండగ అనగా మా అమ్మ వాళ్లంతా వచ్చారు. పండగ అయిపోగానే నన్నూ తీసుకువెళ్తారన్న మాట. మళ్ళీ బడి మొదలు. అప్పటికి ఇంకా దీపావళి రెండు రోజుల్లో ఉంది- అంతలోనే మరో సంఘటన జరిగింది:

పండగ కోసమని ముందుగానే నేను, మా తమ్ముడు టపాసులు కొనుక్కున్నాం. ఆ టపాసులన్నీ బాగా పేలాలంటే వాటిని చక్కగా ఎండబెట్టాలన్నాడు బాబాయి. దాంతో వాటిని ఓ చెక్క పలక మీద పరిచి, ఇంటి ముందు ఎండలో పెట్టాం. నేను, మా తమ్ముడు వాటికి కొంచెం దూరంగా ఉండి ఆడుకుంటున్నాం.

అంతలో మాతమ్ముడు వాటిలో నుంచి ఒక అగ్గిపెట్టె తీసుకొచ్చి కాల్చటం మొదలు పెట్టాడు. ఓ వైపున అగ్గిపుల్లలు కాలుతుంటే,

వాటిని పైకి ఎగరేసి చూస్తే బలే ఉంటుంది కదా, అట్లా నేను కూడా అగ్గిపుల్లని కాల్చి, ఎగరేసి ఆడుకోవటం మొదలెట్టాను.

అంతలోనే ఒక అగ్గిపుల్ల- వెళ్ళి ఎండబెట్టిన టపాకాయల కుప్ప మీద పడింది. మరుక్షణం టపాకాయలన్నీ పేలాయి! 'ఠప ఠప..ధనాల్ ధనాల్..ఫట్ ఫట్..ఢాం..'లతో ఇల్లంతా మారుమ్రోగి-పోయింది. రాకెట్లు 'జుయ్..'మని ఎటు పడితే అటు ఉరికాయి. భూ చక్రాలు అంటుకొని గిరగిరా తిరగటం మొదలెట్టాయి. ఒక్క సారిగా చిచ్చుబుడ్లన్నీ 'సుయ్..' మంటూ వెలుగులు విరజిమ్మేశాయి!

అప్పుడు ఎంత భయం వేసిందో మరి- మా చేతులు, కాళ్ళు వణకడం మెదలెట్టాయి. నేను, మా తమ్ముడు ఇద్దరం మాటల్లేకుండా పడిపోయాము. అందరూ వచ్చి- 'ఏమయిందిరా?' అని అడుగుతుంటే ఒక్కరం కూడా మాట్లాడ-లేకపోయాము. నాకు కూడా ఎక్కడాలేని ఏడుపు వచ్చింది; కాని నోరు మాత్రం పెగల లేదు! చుట్టుపక్కల వాళ్లంతా 'ఎక్కడైనా డైనమైటు పేలిందేమో' అనుకున్నారట!

ఇంక ఆ రోజునుండీ నాకు మా తమ్ముడికి కూడా ఇప్పటి వరకూ టపాకాయలంటేనే ఎంతో భయం పట్టుకున్నది.

ఇప్పటికీ నేను దీపావళి పండుగకు టపాకాయలు కాల్చను.



ఇప్పుడైతే పర్యావరణం పాడవుతుందని టపాకాయలు కాల్చటం అసలే మానేశాననుకోండి. అయినా, ఈ సంగతిని గుర్తుచేసుకోకుండా ఏ దీపావళీ గడవలేదంటే నమ్మండి! మీరూ జాగ్రత్త, మరి- దీపావళి వచ్చేస్తోంది కదా!



మేలు చేసిన మంచితనం

రచన: N. *ప్రజ్ఞ, నాలుగవ తరగతి,* M.P.P *స్కూల్, దాసరివీధి, గుత్తి.*



అనగనగా ఒక ఊళ్లో వీరాస్వామి అనే ధనిక వ్యాపారి ఒకాయన ఉండేవాడు. ఆయనకు పట్నంలో పెద్ద పెద్ద దుకాణాలు మూడు నాలుగు ఉన్నా, పల్లె ప్రజల పట్ల సానుభూతితో వారానికొక పల్లెలో బండెడు సరుకులు సరసమైన ధరలకు అమ్మి రావాలని నియమం పెట్టుకున్నాడు.

అట్లా ఆయన ఒకసారి తన దగ్గర ఉన్న సరుకులను అమ్మటం కోసం ఎద్దుల బండిలో బయలుదేరాడు. పట్నం దాటి కొంత దూరం వెళ్ళే సరికి, అడవి దారిలో దోపిడి దొంగల మూక ఒకటి ఎదురయిందాయనకు. సరుకులున్న బండిని ఎద్దులతో సహా ఎత్తుకెళ్ళిపోవటమే కాకుండా, అడ్డువచ్చిన వీరాస్వామి ఒంటిమీది నగలన్నీ కూడా దోచుకొని, ఆయన్ని బాగా కొట్టి, దారి ప్రక్కన పడేసి మరీ పోయారు దొంగలు. పాపం

వీరాస్వామి, చినిగి మట్టిగొట్టుకున్న దుస్తులతో- 'దాహం దాహం!' అంటూ రోడ్డు ప్రక్కన పడి మూలగ సాగాడు.



సరిగ్గా అదే సమయానికి అటుగా పోతున్నాడు కూలి పని చేసే రంగయ్య. దోపిడి దొంగలు ఎవరినో కొట్టి పడేయటం, బండిని ఎత్తుకెళ్ళటం చూసాడతను. కుతూహలం కొద్దీ అక్కడికి వెళ్ళి, మూలుగుతున్న వీరాస్వామిని చూశాడు కూడాను. అయితే 'ఇతను ఎవరో, ఏమో! నామీదికి వస్తే నేనేం చెయ్యను?' అని గబగబా తన దారిన తాను వెళ్ళిపోయాడు.

ఇంకొంచెం సేపటికి చిన్న వ్యాపారి సోమిశెట్టి అటుగా వెళుతూ ఆగి చూశాడు. 'ఎవరో పడి ఉన్నారు. అయినా నాకెందుకులే' అని అతను కూడా ఎంచక్కా తన దారిన తాను పోయాడు.

ఆ తర్వాత ఇంకొంచెం సేపటికి వచ్చిన నిరుద్యోగి రాజేష్ ఆ వీరస్వామిని చూసి, 'అయ్యో పాపం! ఎవరో ఇతను?! దొంగలెవరో ఇతన్ని బాగా కొట్టినట్లున్నారు. పాపం కదా!" అనుకున్నాడు. అతనిది కొంచెం జాలి గుండె. అతను అక్కడ ఆగి, వీరాస్వామిని లేవనెత్తి, గాయాలన్నీ కడిగి, కట్లుకట్టి, మంచి నీళ్ళు తాగించాడు. ఆ తర్వాత అటుగా పోతున్న బండినొకదాన్ని పిలిచి, బండి నడిపేవాడి సాయంతో అతన్ని దగ్గరలో ఉన్న ఒక హోటల్‌కి తీసుకువెళ్ళాడు. చూడగా ఆ హోటల్ యజమాని తనకు తెలిసినవాడే.

రాజేష్ వీరాస్వామిని వాళ్లకు అప్పజెబుతూ "నేను పట్నానికి వెళ్తూంటే ఈయన ఎవరో మరి, దారిలో కనబడ్డాడు. దొంగలు పాపం బాగా కొట్టినట్లున్నారు. ఈయన్ని మీ సంరక్షణలో వదిలి వెళ్తున్నాను. మూడు రోజుల్లో తిరిగి వచ్చేస్తాను. ఆలోగా ఈయన్ని

బాగా చూసుకోండి. మీ వీలును బట్టి డాక్టరుకు చూపించండి. అతనికి ఏమి కావాలంటే అవి పెట్టండి. ఖర్చులు-అవీ ఎలాగైనా సర్దుతానులెండి" అని చెప్పి పట్నానికి పరుగుతీశాడు.



మళ్ళీ రాజేష్ వచ్చే సరికి వీరాస్వామి కోలుకున్నాడు. "అతను బాగున్నాడు రాజేష్, లోపల ఉన్నాడు వెళ్ళి చూడు" చెప్పాడు హోటల్ యజమాని.

రాజేష్ వీరాస్వామిని కలిసి, అతను లేచి తిరగ గల్గుతున్నందుకు సంతోషపడి "ఇంతకీ ఎవరు నువ్వు? ఎక్కడికి వెళుతున్నావు? నిన్ను కొట్టి పడేసిన వాళ్ళెవరు?" అని అడిగాడు.

"నా పేరు వీరాస్వామి బాబూ. నేను ఒక వ్యాపారిని. నాదగ్గర ఉన్న సరుకులను అమ్మడానికి పక్క ఊరికి వెళుతుండగా దొంగలు నన్ను కొట్టి, నా సరుకులను అన్నిటినీ దోచుకొని వెళ్ళారు. 'దాహం దాహం' అంటున్నా ఎవరో ఇద్దరు ఆ దారిన పోతున్నవాళ్ళు, కనీసం త్రాగడానికి నీళ్ళు కూడా ఇవ్వకుండా వెళ్ళి పోయారు. ఏంచేస్తాం, సమాజం అలా ఉంది. నువ్వు వాళ్ళలాగా కాకుండా మానవత్వంతో నన్ను కాపాడావు. నీ మేలు మరవలేను. ఇంతకీ నీ వివరాలేంటి? ఎవరు నువ్వు, ఏమి చేస్తుంటావు?" అని రాజేష్‌ని అడిగాడు వీరాస్వామి.

"నాదేముంది, నేను ఒక నిరుద్యోగినండీ- ఉద్యోగం వెతుక్కుంటూ పట్టణానికి బయలుదేరాను. దారిలో రోడ్డు ప్రక్కన పడి కనిపించారు మీరు. సరే, అక్కడికి దగ్గర్లోనే నాకు తెలిసిన హోటల్ ఒకటి ఉంటేనూ, ఆ హోటల్ యజమానికి మిమ్మల్ని అప్పజెప్పి నా పని మీద నేను వెళ్ళాను. ఆయనే మిమ్మల్ని కనిపెట్టుకుని ఉన్నారు ఈ మూడు రోజులుగా" అన్నాడు రాజేష్.

మరి నీ ఉద్యోగం సంగతి ఏమైంది? ఏదైనా దొరికిందా?" అడిగాడు వీరాస్వామి.

రాజేష్ కొంచెం సిగ్గు పడుతూ "ఇంకా ఏమీ లేదండి. వచ్చే వారం మళ్ళీ రమ్మన్నారు" అన్నాడు.

"నీకు సమ్మతం అయితే నేను నీకు ఉద్యోగం ఇస్తాను- నీలాంటి వాడి కోసమే, నేను ఇన్ని రోజులు వెతుకుతూ ఉన్నది" అని అతనిని పనిలో పెట్టుకున్నాడు వీరాస్వామి.

బాధ్యత, మంచితనం ఉన్న రాజేష్‌కి వీరాస్వామి త్వరలోనే తన వ్యాపార బాధ్యతనంతా అప్పజెప్పాడు!

నవ్వు!

1. ముఖం ఉంది; రెండు చేతులున్నాయి; కానీ కాళ్లు లేవు పొట్టాలేదు- ఎవరిది?

2. ఒక బొటన వేలుంది; నాలుగు వేళ్లున్నై; కానీ ప్రాణం లేదు ఎవరికి?

3. మెడ ఉంది కానీ తల లేని దెవరికి?

4. ఇదైతే నీదే కానీనీకంటే ఇతరులే దీన్ని ఎక్కువ వాడతారు. ఏంటది?

పొడుపుకు సమాధానాలు:
1.గడియారం 2. గ్లోవ్స్ 3. బాటిల్
4. నీ పేరు

టీచర్: పోయి లైను చివర్లో నిలబడమన్నానా?

చింటు: అక్కడ ముందుగానే రాము నిలబడి ఉన్నాడు సార్!

రామక్క: డాక్టరు గారూ! మా పాత డాక్టరు గారు నా టాన్సిల్స్, అడెనాయిడ్లు, పిత్తాశయం, గర్భాశయం, అపెండిక్స్, కిడ్నీలు అన్నీ తీసేశారు-అయినా నాకు బాగు కాలేదు ఎందుకంటారు?

డాక్టరు గారు: తీసేసేందుకు ఇంకేమీ మిగల్లేదు కదా, అందుకని.

పేషంట్: డాక్టరు గారూ, నేనో సెల్ ఫోన్ అయిపోయినట్లు అనిపిస్తోంది.

డాక్టర్: ఏం పర్లేదు, యీ మాత్రలు రెండ్రోజులు వేసుకోండి, గుణం కనిపించకపోతే ఓ మిస్డ్ కాల్ ఇవ్వండి



స్నేహం కథ

రచన: మధుశ్రీ, తొమ్మిదవ తరగతి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పొట్లూరు, గుంటూరు జిల్లా.



అనగనగా ఒక అడవి. ఆ అడవిలో నివసించే చిలుక, పావురం ప్రాణమిత్రులు- ఎప్పుడూ కలసి మెలసి ఉండేవి. ఒకదాని కష్ట సుఖాల్లో ఒకటి పాలు పంచుకునేవి. వాటి స్నేహం చూసి అడవి జంతువులు అన్నీ ఆశ్చర్య పోయేవి. చాలా వరకు సంతోషించేవి. కొన్ని మటుకు అసూయ పడేవి.

అన్నింటికంటే ఎక్కువ అసూయపడేది నక్క. వాళ్ళని విడదీయాలనుకునేది. కానీ ప్రాణమిత్రులు కదా, వాటిని విడదీసేదెలాగ? అందుకని అది ఒక క్రమం ప్రకారం పావురం గురించి చిలుకకు, చిలుక గురించి పావురానికి చెడ్డగా చెప్పటం మొదలు పెట్టింది.

రాను రాను చిలుక పావురం దాని వలలో పడటం మొదలు పెట్టాయి. అది చెప్పే అబద్ధాలనే నిజాలనుకోసాగాయి. కొంచెం కొంచెంగా ఒకదానికొకటి దూరమయ్యాయి.

అయినా కూడా నక్క మనసు నిండలేదు. అది సంతృప్తి పడలేదు. ఒకరి గురించి ఒకరికి చాడీలు చెప్తూనే పోయింది.

అతి అన్నిచోట్లా అనర్ధదాయకమే కదా, ఒకరోజున తన గురించి చిలుకకు చెడ్డగా చెప్తుంటే విన్నది పావురం. నక్క అటు వెళ్లగానే చిలుకని కలుసుకొని జరిగిన కథ అంతా చెప్పింది. మిత్రులిద్దరూ మళ్ళీ ఒక్కటయ్యాయి. నక్క ఎవరికి ఏం చెప్పిందో పంచుకున్నాయి. ఇదంతా నక్క జిత్తులేనని అర్థం చేసుకున్నాయి. దాంతో నక్క పన్నాగం విఫలమయింది.

అయినా అది తన ప్రయత్నాన్ని మానలేదు. ఎప్పటిలాగే రెండింటికీ ఒకదానిమీద ఒకదానికి చాడీలు చెప్పసాగింది.

ఒక రోజున స్నేహితులు రెండూ కలుసుకొని, "ఎంత చెప్పినా ఈ నక్క మనల్ని విడదీయాలనే చూస్తున్నదే! దీని పని పట్టేదెలాగ?" అని ఆలోచించాయి. చివరికి రెండూ కలిసి సింహరాజు దగ్గరికి వెళ్ళాయి.

"రండి రండి! మీ స్నేహం గురించి నాకు అందరూ చెప్పారు. మీరు మన అడవికే ఆదర్శం!" అన్నది సింహం, వాళ్ళని కూర్చోబెడుతూ.

"మా స్నేహాన్ని చెడగొట్టేందుకు ఓ నక్క జిత్తులు పన్నుతూ పోతున్నది. తమరు దాన్ని మందలించకపోతే మా పని ఇంతటితో సరి అవుతుంది"అని చిలుక, పావురం తమకొచ్చిన కష్టాన్ని విన్నవించుకున్నాయి సింహానికి.

"బాగుంది బాగుంది! మేం నక్కను పిలిచి మందలించవచ్చు; కానీ అది తన ప్రయత్నాలు మానుకోవాలంటే పదిమంది ఎదుటా దాని పన్నాగాలను బయట పెట్టటం అవసరం!" అన్నది సింహరాజు ఆలోచిస్తూ.

"తమరు ఎలా చెబితే అలా చేస్తాం" అన్నాయి రెండూనూ.

"సరే, ముందు మీరు దాన్ని మాయ చేసి నా దగ్గరకు తేవాలి-" అని సింహం వాటికి ఒక ఉపాయం చెప్పింది.

దాన్ని వినగానే మిత్రుల ముఖాలు వికసించాయి.

ఆనాటినుండీ చిలుక-పావురం రెండూ ఇంకా ఎడముఖం-పెడముఖంగా ఉండటం

మొదలు పెట్టాయి. నక్క ఎదుట పడగానే చిలుక మీద చిందులు తొక్కింది పావురం. నక్క కదిలించగానే పావురం మీద ఇంతెత్తున లేచింది చిలుక. నక్కకు చాలా సంతోషం అయ్యింది. "పావురం నిన్ను చంపమన్నది" అని చిలుకకు చెప్పిందది. "చిలుక నిన్ను చంపమన్నది" అని పావురానికి చెప్పింది.



పావురం దానితో- "పద, ఈ సంగతి సింహానికి చెబుదాం. చిలుకకి అదే తగిన శాస్తి. రాజుగారు దండిస్తే తప్ప దానికి బుద్ధి రాదు" అన్నది. "అవును-అంతే" అన్నది నక్క. తన మాయలు ఫలించాయని దానికి చాలా సంతోషం వేసింది. పావురాన్ని వెంటబెట్టుకొని సింహం దగ్గరకు వెళ్ళిందది.

నక్క-పావురం చెప్పిన దాన్ని విని, సింహరాజుగారు తలాడించారు. "చిలుకను ఈడ్చుకు రండి" అని సైనికులకు కనుసైగ చేశారు. వాళ్ళు అక్కడే ఉన్న చిలుకను సింహరాజుగారి ముందు ప్రవేశపెట్టారు.

అంతే- పావురం, చిలుక రెండూ ఒకటయిపోయాయి. నక్క తమకు చేసిన ద్రోహాన్నంతా నక్క ముందే సింహరాజుకు విన్నవించుకున్నాయి.

పరిస్థితి తనకు ఇలా ఎదురు తిరుగుతుందని ఊహించని నక్క భయంతో వణికి పోయింది. సింహరాజు కోపంతో ఊగిపోయింది.

నక్క భయపడి "నన్ను ఏమీ చేయవద్దు- ఇలాంటి తప్పులు ఇక చేయను" అని ప్రాధేయపడింది. అయినా వినకుండా నక్క మీదికి దూకింది సింహం.

వెంటనే పావురం, చిలుక దానికి అడ్డుగా నిలబడి "సింహరాజా! ఇదొక్క అవకాశం ఇవ్వండి- ఈ తర్వాత కూడా నక్క మారకపోతే, అప్పుడు చంపేయండి దాన్ని.

ఇప్పటికి మాత్రం ఏదైనా ఒక చిన్న శిక్షతో సరిపుచ్చండి" అని వేడుకున్నాయి.

సింహం నక్కను క్షమించి వదిలివేసింది. తన తప్పును తెలుసుకొన్న నక్క మంచిగా మారిపోయింది.

పూలకు ఉన్నాయి రేకులు
నవ్వుకు ఉన్నాయి జోకులు
తలుపుకు ఉన్నాయి మేకులు
జన్మదినానికి ఉన్నాయి కేకులు
వంటకు ఉన్నాయి బోకులు
చెప్పేందుకు ఉన్నాయి సాకులు
చదవటానికి లేవు బ్రేకులు

కవిత

వనాలు జగతికి అందిన వరాలు
ధరణి మెడలో సిరుల హారాలు
జీవరాశుల ఆదరించే మమత నిలయాలు
కాలుష్యాన్ని హరించే వీర సైనికులు
వాతావరణాన్ని కాపాడే విశ్వరక్షకులు
ఫలితము ఆశించని స్వచ్ఛంద సేవకులు



-k. మహేష్, ఏడవ తరగతి, P.V.R. Z.P.H. స్కూల్, గుండువారి పల్లి, తలుపుల(మండలం), అనంతపురం(జిల్లా).

ఒక కరెంటు బల్బుని తీయాలంటే కనీసం ఎంత మంది వెంగళప్పలు అవసరం?

ముగ్గురు-

ఒకరు బల్బుని పట్టుకోవటానికి; ఇద్దరు కుర్చీని తిప్పటానికి!

ప్రశ్న: నిండా వెంగళప్పలతో పోతున్న సబ్ మెరీన్ ను ఎట్లా ముంచవచ్చు?

జవాబు: తలుపు తడితే సరి!

వెంగళప్ప ఊపిరాడకుండా చేసే వాక్యం?

“అదేంటో నీకు రేపు చెబుతాను”



తృప్తి

రచన: ఆర్ సౌమ్య, ఏడవ తరగతి, ఆంప్ర.గురుకుల పాఠశాల, మైలవరం (గ్రా, మం) కడప జిల్లా.



అనగనగా శివలింగాపురం అనే ఊళ్ళో రంగయ్య-సోమయ్య అనే అన్నదమ్ములు ఇద్దరు ఉండేవాళ్ళు. వాళ్ళు చాలా బీదవాళ్ళు. వాళ్ళకున్న ఆస్తల్లా పూర్వీకులు ఇచ్చిన ఐదెకరాల భూమీ- ఓ పాత ఇల్లూనూ. వాటితోటే రెండు కుటుంబాలూ బ్రతుకు లాగేవి. అన్నదమ్ములిద్దరూ కలిసి తమ భూమిలో పంటలు పండించేవాళ్ళు; వచ్చిన లాభాన్ని ఇద్దరు పంచుకొని తృప్తి పడేవాళ్ళు.

వాళ్ళ ఇంటికి ఎదురుగానే ఓ షావుకారు ఉండేవాడు. అతని దగ్గర అంతులేని డబ్బు ఉండేది; కానీ ఎప్పుడూ ఏవేవో బాధలు. రంగయ్య సోమయ్యలను చూస్తే అతనికి చాలా అసూయగా ఉండేది: "ఇదేంటి, నాకు

ఇంత డబ్బు ఉన్నా సంతోషం లేదెందుకు? నాతో పోలిస్తే వాళ్ళకు అసలు ఏమీ లేదే, అయినా వాళ్ళు అంత సంతోషంగా ఎలా ఉండగల్గుతున్నారు?" అని. అయితే అతని ప్రశ్నకు సమాధానం తెలిసే అవకాశం లేదు- రంగయ్య-సోమయ్యలను అడిగితే కూడా ప్రయోజనం ఏమీ లేదు- వాళ్ళ సంతోషానికి కారణం వాళ్ళకే తెలీదు మరి!



ఇలా ఉండగా షావుకారుకు చిన్నతనంలో పాఠాలు చెప్పిన గురువుగారు ఒకరోజున అతన్ని వెతుక్కుంటూ వచ్చారు. షావుకారు ఆయన్ని ఆదరించి, భోజనం పెట్టి, తినేటప్పుడు దగ్గర కూర్చొని విసనకర్రతో విసరుతూ, ఎదురింట్లోని రంగయ్య-సోమయ్యలను చూపించి, "గురువుగారూ! నాకు ఇంత డబ్బు ఉన్నా సంతోషం లేకుండా ఉన్నదెందుకు? ఆ ఎదురింట్లో వాళ్ళకు ఏమీ లేదు కదా, అయినా అంత సంతోషంగా ఉన్నారు ఎందుకని? లోకాచారం ప్రకారం డబ్బుంటే అన్నీ ఉండాలి కదా స్వామీ?" అన్నాడు.

గురువుగారు అప్పుడు "నాయనా! ఉన్న దాంతో తృప్తి పడేవాడే ఎప్పుడూ సంతోషంగా ఉంటాడు తప్ప, డబ్బు ఉన్నవాడు కాదు. అందులో కూడా సంతోషం అనేది అందరికీ ఉండదు- తృప్తిగా ఎందుకుండాలో అర్థం చేసుకొని, దాన్ని జీవితంలో నిలుపుకోవాలనుకునేవాడికి తప్ప, వేరొకరికి ఆ భాగ్యం ఉండదు. కావాలంటే ప్రయత్నించి చూడు" అంటూ ఒక ఉపాయం చెప్పాడు.

ఆ రోజునే దాన్ని అమలు చేశాడు షావుకారి. ఎదురింటి రంగయ్య-సోమయ్యలను పిలిచి "మీరు ఇంత సంతోషంగా ఉండటం చూసి నా మనసు నిండిపోతున్నది. 'నేనూ మీలా ఉండగల్గితే బాగుండును' అనిపిస్తున్నది.

మీకిద్దరికీ నా తరపున చిన్నపాటి బహుమతి ఇస్తాను-కాదనకండి" అంటూ ఇద్దరికీ చెరొక వంద బంగారు నాణాలు ఇచ్చి వచ్చాడు.

తన వంతు డబ్బును కొడుకుకి, భార్యకు చూపించాడు రంగయ్య. వాళ్ళిద్దరూ మురిసిపోయారు. వాళ్ల సంతోషాన్ని చూసి రంగయ్య కూడా మురిసిపోయాడు.



రంగయ్య కొడుకు ముందుకొచ్చి ఒక నాణెం తీసుకోబోయాడు. నాణాల సంచీని గబుక్కున వెనక్కి లాక్కున్నాడు రంగయ్య.

భార్య ఒక నాణాన్ని చేతిలోకి తీసుకొని చూస్తుండగా భార్యని తిట్టి ఆ నాణాన్నీ లాగేసుకున్నాడు. 'ఏనాడూ లేనిది ఇవాళ్ల ఇలా ప్రవర్తిస్తున్నాడేమి?' అంటూ భార్య, కొడుకు ఇద్దరు ముఖాలు ముడుచుకున్నారు.

రంగయ్య ఇవన్నీ గమనించే స్థితిలో లేడు: 'నాణాలను ఎలా దాచాలి? ఎక్కడ దాచాలి? ఇంట్లో ఉంచితే భార్య-కొడుకు వీటిని మిగలనివ్వరు' అని దీర్ఘంగా ఆలోచించటం మొదలు పెట్టాడు. చివరికి వాటిని తీసుకెళ్ళి తన పొలంలోనే ఎవ్వరూ చూడకుండా ఒక గుంతలో దాచి పెట్టాడు. రోజూ ఒక్కడే వెళ్ళి, గుంతను త్రవ్వి, బంగారు నాణాలను బయటికి తీసి, లెక్కపెట్టుకొని, మళ్ళీ యథాప్రకారం పాతిపెట్టి ఇంటికి రాసాగాడు రంగయ్య.

ఇక సోమయ్యకూడా షావుకారు తనకిచ్చిన నాణేలను భార్య, పిల్లలకు చూపించాడు. వాళ్ళూ చాలా ఆనందపడ్డారు. అయితే వెంటనే సోమయ్య భార్య అడిగింది: "షావుకారు మామూలుగా ఎవరికీ ఏమీ ఇచ్చే రకం కాదే, మరి ఈ నాణాలను మనకి ఎందుకిచ్చాడబ్బా?" అని. "ఏమో, మనం సంతోషంగా ఉండటం చూసి ఇచ్చాడట. తనకూ మనలాగా ఉండాలని ఉందట" చెప్పాడు సోమయ్య.

సోమయ్య భార్య "అవునా!" అని ఊరుకున్నది. అది విన్న సోమయ్యకూ కొంచెం అనుమానం వేసింది. "ఇందులో ఏదో మనకు తెలీని మతలబు ఉండవచ్చు. అందుకని అసలు ఈ నాణాలు మనవి కావనుకుందాం. ఎక్కడైనా భద్రంగా పెట్టి, ఇక పట్టించుకోనట్లు వదిలేద్దాం. ఆ సొమ్ము మనదే అయితే పర్లేదు; లేకపోతే షావుకారు మళ్ళీ వచ్చి అడుగుతాడు-ఇచ్చేయచ్చు. ఏమంటావు?" అన్నాడు సోమయ్య.

"అదే మంచిది" అని భార్య-పిల్లలు అన్నమీదట, వాళ్లంతా కలిసి దాన్ని ఇంటి పెరట్లో ఒక మూలన పాతిపెట్టి, ఇక ఆ సంగతి మరచిపోయారు.

షావుకారు తన పథకం ప్రకారం ఇద్దరినీ గమనిస్తూనే ఉన్నాడు. తను ఇచ్చిన నాణాలను ఎవరు ఎక్కడ దాచారో కూడా చూశాడు. రంగయ్య ఇప్పుడు నిద్రలేని రాత్రులు గడుపుతున్నాడు. సోమయ్య మటుకు ఎప్పటిమాదిరే ప్రశాంతంగా ఉన్నాడు. ఇద్దరినీ చూసిన షావుకారు నవ్వుకున్నాడు. తన గురువుగారికి మనసులోనే నమస్కారం పెట్టుకున్నాడు. పథకంలో రెండో భాగానికి శ్రీకారం చుట్టాడు.

తర్వాతి రోజున పొలంలో ఖాళీ గుంతను చూసిన రంగయ్యకు గుండె ఆగినంత పనైంది. రంకెలు వేసుకుంటూ, గుండెలు బాదుకుంటూ, ఊరంతా అల్లరి చేస్తూ పరుగులు పెట్టాడతను- "నా డబ్బెవరు దొంగిలించారు?" అని పెడబొబ్బలు పెట్టాడు. రంగయ్య కుటుంబ సభ్యులందరూ గొల్లుమన్నారు. ఇరుగు పొరుగులంతా చేరి వాళ్లను ఓదార్చాల్సి వచ్చింది. రంగయ్యకు ఆ రోజునుండీ కంగారు ఎక్కువైంది; అతని ఆరోగ్యం కూడా బాగా చెడిపోయింది. ఇంటికి వెళితే కంచంలోనూ గ్లాసుల్లోనూ ముద్దకు, నీళ్లకు బదులు బంగారు నాణేలే కనబడసాగాయి. 'నా పిల్లలెలా బ్రతుకుతారు? ఇప్పుడెలా?' అన్న బెంగతో అతను చిక్కి సగం అయిపోయాడు.

ఈ సంగతి తెలిసి, "విన్నారా, షావుకారు మీ అన్నకిచ్చిన సొమ్మును ఎవరో ఎత్తుకెళ్ళారట.

మన సొమ్ము ఎలా ఉందో మరి?" అన్నది సోమయ్య భార్య. ఇద్దరూ కలిసి పెరట్లో త్రవ్వి చూశారు- నాణాలు లేవు! "నేను అప్పుడే అన్నానుగా, మనది కాని సొమ్ముకు మనం ఆశ పడకూడదు" అన్నది సోమయ్య భార్య. "అవును. ఆ సొమ్ము మనది కాదు- అందుకే పోయింది" అన్నాడు సోమయ్య, తిరిగి గుంతను పూడ్చేస్తూ. అటుపైన వాళ్ళంతా ఎప్పటిమాదిరే ప్రశాంతంగా నిద్రపోయారు.

వీళ్ళిద్దరినీ గమనిస్తున్న షావుకారికి అర్థమైంది: సంతోషానికి కారణం తృప్తి. అయితే తృప్తి అనే జీవితాదర్శం నిలవాలంటే దాన్ని అర్థం చేసుకొని మన జీవితంలోకి స్వాగతించటం అవసరం. అలా కానప్పుడు, 'తృప్తి' అనే ఆ వస్తువు యాంత్రికంగా నిలవజాలదు. ఏదో ఒకనాడు అది పోతుంది; అసంతృప్తినే మిగుల్చుతుంది. తృప్తిని తమ స్వభావంలో ఒకటిగా చేసుకోగల్గినవాళ్ళు ధన్యులు.

మరునాడు అన్నదమ్ముల దగ్గరికి వెళ్ళిన షావుకారు ఇద్దరి చేతుల్లోనూ రెండు వందల నాణాలు పెడుతూ "మిమ్మల్ని ఆందోళనకు గురిచేశాను- నన్ను క్షమించండి. మీరు దాచిన సొమ్మును అవసరం కొద్దీ తిరిగి తీసుకున్నది నేనే. మీకు ముందుగా చెప్పి ఉండాల్సింది" అన్నాడు.

రంగయ్య వాటిని తీసుకొని, గుండెలకు హత్తుకుంటూ నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు. సోమయ్య చిరునవ్వు నవ్వాడు. షావుకారుకు సోమయ్యంటే గౌరవం మరింత పెరిగింది.

నవ్వు!

చింటూ: బంటీ! నువ్వు ముఖం కడుక్కోలేదని మీ అమ్మ ఎలా కనుక్కున్నది?

బంటీ: నేను సబ్బుని తడపటం మర్చిపోయాననుకుంటా

డాక్టరు: నీ చెయ్యి రెండు చోట్ల విరిగింది.

వెంగళప్ప: కాదు సార్! నేను ఒకే చోట పడ్డాను మరి.



బర్ఫీ దయ్యం

రచన: అన్నమనేని శివ, ఆరవ తరగతి, రిషీ వ్యాలీ స్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

అనగనగా ఒక ఊరిలో భాను అనే బర్ఫీ వాడు ఉండేవాడు. రోజూ బర్ఫీ దుకాణం తెరిచి, ఉదయం ఆరు గంటల నుండి రాత్రి పది గంటల వరకు ఉండేవాడు. 'భాను బర్ఫీలు ఎంత బాగున్నాయో' అని అందరూ అనుకునేవాళ్ళు.

ఒకరోజున ఎవరో వింత వ్యక్తి ఒకడు భాను ముందుకు వచ్చి నిలబడ్డాడు. పొడవాటి దుబ్బ అంగీ లాంటి జ్యాకెట్ వేసుకొని ఉన్నాడతను.

భాను అతనెవరో చూడలేదు గానీ, అతను వేసుకున్న దుబ్బ జ్యాకెట్టును చూసి ఆశ్చర్యపోయాడు. "ఏం రా? ఇంత వేడికి జ్యాకెట్ ఎందుకు వేసుకున్నావు?" అని అడిగాడు.

"వేడిగా ఎక్కడుంది, ఇంత చల్లగా ఉంటేనూ!?" అని వికవికా నవ్వాడు ఆ దుబ్బ అంగీ వాడు.

"ఏంటి ఇట్లా నవ్వుతున్నాడు?" అని అతని వైపుకు చూసిన భాను నిర్ఘాంతపోయాడు-

ఆ జ్యాకెట్ వేసుకున్నవాడు అసలు మనిషి కాదు! ఒక దయ్యం!!

"నువ్వు తీసెయ్యమంటున్నావు గనక తీసేస్తున్నాను. ఇప్పుడు నువ్వు నన్ను చూసి దడుచుకుంటే అది నా బాధ్యత కాదు-" అంటూ జ్యాకెట్‌ని తీసి పడేసింది ఆ దయ్యం.



ఆ దయ్యానికి చేతులు లేవు, కాళ్ళు లేవు. అది జ్యాకెట్ తీసే సరికి నిజంగానే భాను చాలా భయపడ్డాడు.

భాను భయపడటం చూసి దయ్యానికి చాలా సంతోషం వేసింది. "ఆహా, ఇన్ని సంవత్సరాలుగా తిరుగుతున్నాను. ఇంత భయాన్ని అసలు చూడలేదు. ఇంత చక్కని ఆహారం అంతకన్నా అస్సలు చూడలేదు. ఇప్పుడు నీ పుణ్యమా అని నాకు నీలాంటి చక్కని ఆహారం దొరికింది. అదిగూడా ఎంచక్కా నేనంటే భయపడే ఆహారం! ఏమి నా అదృష్టం!" అంటూ భాను మీదికి ఎగిరి దూకింది.

దయ్యం తనమీదికి దూకగానే కీచుమని అరిచిన భాను నోటిలోంచి తనంతట తానే ఓ సలహా వెలువడింది- "అయ్యో నన్ను తినొద్దు! నాకు భార్యా, పిల్లలు ఉన్నారు. కావాలంటే ఈ బర్ఫీలు తిను! నాకంటే ఇవే తియ్యగా ఉంటాయి!" అని.

"బర్ఫీలంటే ఏంటి?" అడిగింది దయ్యం, టక్కున ఆగి.

"ఇవిగో ఇవే! ఇందాకటి వరకూ అందరూ వీటినే కదా, అడిగి అడిగి మరీ కొనుక్కుపోతున్నారు?!" అని బర్ఫీలున్న ప్లేటును దాని ముందుకు జరిపాడు భాను.

దయ్యం నోరు ముందుకు పెట్టి ఒక్కటొక్కటిగా బర్ఫీలన్నీ తిని, "అబ్బా

ఎంత బాగున్నాయో!" అని నాలుక చప్పరించింది. ఆ తర్వాత మరేదో ఐడియా వచ్చినట్లు "సరే! అయితే నిన్ను తిననులే! కానీ మరి నువ్వు రోజూ నాకు బర్ఫీలు చేసి పెట్టాలి సరేనా?" అన్నది భానుతో.

"బ్రతికాం! అంతే చాలు" అనుకున్న భాను దానికి సంతోషంగా ఒప్పుకున్నాడు. అటుపైన కొన్నాళ్లపాటు తను ఇచ్చిన మాట ప్రకారం రోజూ అన్నన్ని బర్ఫీలు చేసి దయ్యానికి ఇచ్చి తినిపించాడు గానీ, కొన్నాళ్లకి భానుకి దయ్యం అంటే భయం పోయింది. అంతేకాక రోజూ దానికి బర్ఫీలు ఉచితంగా తినిపించి-తినిపించి అతను కాస్తా ఇప్పుడు పేదవాడు అయిపోయాడు. మరి భాను ఎంత శ్రమపడ్డా తన శ్రమకి తగినన్ని డబ్బులు రావట్లేదు కదా!

దాంతో ఒక రోజున భానుకు దయ్యం మీద ఎక్కడ లేని కోపం వచ్చింది. చటుక్కున పోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒక రోజున దయ్యం దుకాణంలో నిలబడి బర్ఫీలు తింటుండగా పోలీసు దాని వెనుక నిలబడి తుపాకీ గురిపెట్టి 'హాండ్స్ అప్' అని అరిచాడు. దయ్యం అతన్ని పట్టించుకోలేదు. "ఒక్క నిమిషం- నేను బర్ఫీలు తినాలి. తర్వాత మాట్లాడదాం" అంది.

'నేను నిన్ను అరెస్టు చేయడానికి వచ్చాను- నువ్వు బర్ఫీలు తింటుంటే చూడడానికి కాదు!" అన్నాడు పోలీసు చికాకుగా.

'సరే నువ్వు నన్ను 'హాండ్స్ అప్' అన్నావు, కానీ నాకు హాండ్స్ లేవుగా?" అని మాయమైపోయింది దయ్యం-"ఈ భానుకి, వీళ్లందరికీ నేనంటే భయం పూర్తిగా పోయింది. భయం లేని చోట నేను ఉండీ లాభం లేదు. భయపడని వాళ్ల మాంసం నాకు అరగదు కూడానూ. ఏం చేసేది, మరో చోటు వెతుక్కుంటాను. మరి అక్కడ బర్ఫీలు దొరుకుతాయో, లేదో, చూడాలి!" అనుకుంటూ.

చిట్టి కవితలు

రచన: డా ఆర్. సుమన్ లత , హైదరాబాదు

పాకుతూ పాపాయి



పాకుతూ పాపాయి పైడినీ పట్టింది
వెన్న దొంగలా పోయి వెండినీ లాగింది
కథలు రాస్తానంటు కలాన్ని కోరికింది
తెలుగు మధురిమ నేనంటూ తేనెనూ తీసింది
చదువులో ముందంటు పొత్తాన్ని ఎత్తింది
ఏ దేశ మేగినా ఎందు కాలిడినా
అమ్మ బిడ్డ నేనంటూ ఎత్తుకోమంది !!



నిర్లక్ష్యం కూడదు

జీడిపప్పు -జీడిపప్పు మాడి పోయింది
పక్కనున్న రైలు బండి పారిపోయింది
చేనంతా ఆవు దూడ తొక్కి పోయింది
కొతులొచ్చి కొమ్మలన్ని విరిచి పోయాయి
పిట్టలలొచ్చి కంకులన్నీ పొడిచి పోయాయి
నిర్లక్ష్యం కూడదని అర్థమయింది !



చంటి

రచన: సి.ప్రణయజ, శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్, బ్రాడీపేట,గుంటూరు.


అనగనగా ఒక అందమైన అడవి. అడవి మధ్యలో ఒక పేద్ద, అందమైన కొలను. కొలను నిండా ఎప్పుడూ పుష్కలంగా నీళ్ళు. కొలను చుట్టూ ఎవరో నాటినట్లు రకరకాల పండ్ల చెట్లు. కొలను నిండా బాతులు, కొంగలు, హంసలు, చేపలు, తాబేళ్లు! పండ్ల చెట్లనిండా కాకులు, చిలకలు, గోరువంకలు ఇలా ఎన్నో పిట్టలూ, వాటితో పాటు ఉడతలు, కోతులు, తొండలు! అవన్నీ అక్కడ ఎంతో స్నేహంగా కలిసి మెలిసి జీవిస్తున్నాయి.

రోజూ పొద్దున్నే పక్షులు, జంతువులు వేటకు బయలుదేరతాయి. సాయంత్రానికి గానీ తిరిగి రావు. వెళ్లే ముందు జంతువులు, పక్షులు అన్నీ తమతమ పిల్లలకు జాగ్రత్తలు చెప్పి వెళతాయి- "చిన్నా! అటు ఇటూ తిరగొద్దు. వేరే జంతువులతో జాగ్రత్త" రోజూలాగే చెప్పింది జింక తన పిల్లతో.

"తల్లీ! నువ్వింకా చిన్నదానివి. నీ రెక్కలు ఇంకా బలం పుంజుకోలేదు. గూటిలోంచి ఎగిరి క్రింద పడకు- జాగ్రత్తగా ఉండు" అన్నది కాకి తన పిల్లతో.

"పెద్దోడా! చెల్లెళ్ళను, తమ్ముళ్ళను జాగ్రత్తగా చూసుకో. ఎటూ వెళ్ళనివ్వద్దు" అన్నాడు తండ్రి తాబేలు తన పెద్ద కొడుకుతో.

"బేబీ! నేనొచ్చేటప్పుడు నీకో మంచి చేపను తెస్తాను- చేపలంటే నీకిష్టం కదా!" అన్నది ఎలుగుబంటి తన పిల్లతో.



"సరేనమ్మా, సరే నాన్నా!" అన్నాయి పిల్లలన్నీ వాటి అమ్మానాన్నలతో.

పెద్దవన్నీ అటు వెళ్ళగానే పిల్లలన్నీ ఒక చోట చేరాయి:

"ఏ ఆట ఆడుకుందాం ఈరోజు?" అడిగింది కాకి పిల్ల- మెరుస్తున్న కళ్ళతో.

"ఎగిరే పందాలు ఆడదాం" అంది డేగ పిల్ల, ఉత్సాహంగా ఎగురుతూ.

"మేం ఎగరలేం కదా, మరి మాకెట్లాగ?" అడిగింది పందిపిల్ల సందేహంగా.

"సరేలే, రోజూలాగే కోతికొమ్మచ్చి ఆడుకుందాం!" అంది చంటి. కోతిపిల్లల గుంపులో అన్నింటికంటే చిన్నది చంటి. బొద్దుగా, చలాకీగా ఉంటుందది- పిల్లలన్నిటికీ చంటి అంటే చాలా ఇష్టం. "సరే సరే" అన్నారు అందరూ ఉత్సాహంగా.

ఆట మొదలైంది. ఇక అక్కడంతా సందడే సందడి: కొన్ని ఎగురుతున్నాయి, కొన్ని దూకుతున్నాయి, కొన్ని ఉయ్యాలలు ఊగుతున్నాయి, కొన్ని అరుస్తున్నాయి, కొన్ని నవ్వుతున్నాయి- అంతలో ఉన్నట్టుండి నల్ల చెవుల తెల్ల కోతి పిల్ల ఆడడం ఆపేసింది.

"ఏంటి? ఏమయింది?!" అన్నాయి అన్నీ విచిత్రంగా దానివైపు చూస్తూ.

"ఎప్పుడూ కోతికొమ్మచ్చి ఆడి, ఆడి బోరు

కొడుతున్నది. ఇంకేదైనా ఆట ఆడదాం" అంది ముఖం అదోలా పెడుతూ.

"గోళీలాట ఆడదాం!" అంది నల్ల కోతి కళ్ళు తిప్పుతూ.

"మాకు చేతులు లేవుగా, మేమెట్లా ఆడతాం?" అంది పిచ్చుక పిల్ల.

"క్రికెట్ ఆడుదాం!" అంది జీబ్రా పిల్ల.

"మాకు రాదు" అన్నాయి ఆడపిట్టలన్నీ.

"పరుగు పందెం పెట్టుకుందామా?" అడిగింది తాబేలు పిల్ల.

"నేనే గెలుస్తాను!" అంది కుందేలు పిల్ల.

"ఆగండాగండి- నాకొక ఐడియా వచ్చింది. దాగుడు మూతలు ఆడదాం!" పైకి, కిందికి దూకుతూ అంది చంటి.

అందరికీ ఈ ఆలోచన నచ్చింది. "భలే-భలే!" అంటూ చప్పట్లు కొట్టారు.

"ఒకటి...రెండు... మూడు..” లెక్క పెట్టడం మొదలు పెట్టింది కొంగ పిల్ల.

తాబేలు పిల్ల పోయి నీళ్ళల్లోని రాయి కింద దాక్కుంది. బాతు పిల్ల పోయి నీటి మొక్కల్లో నక్కింది. బల్లి పిల్ల చెట్టు బెరడులో దూరింది. కోతి పిల్లలు వెళ్ళి ఆకు గుబుర్లలో దాక్కున్నాయి. పిట్ట పిల్లలు గూళ్ళ కింద పుల్లల్లో ఇరుక్కొని కూర్చున్నాయి.

చంటికేమో ఓ చెట్టు కాండానికి ఉన్న చిన్న తొర్ర ఒకటి కనిపించింది. దానిలోకి దూరదామనుకుంటే వీలవ్వలేదు. చివరికి బాగా ప్రయత్నించాక, పట్టలేక పట్టలేక-దూరింది.

"ఎక్కడ దాక్కున్నారు వీళ్ళంతా? ఆగండి, వెతికి పట్టుకుంటా. ఒక్కళ్ళూ దొరక్కుండా ఎలా ఉంటారు?" అంటూ వచ్చింది కొంగపిల్ల పది లెక్కపెట్టిన తరువాత.

చెట్టు వెనుక, పుట్ట వెనుక, గూళ్ళల్లో, ఆకుల్లో అంతటా చూసింది. బండరాయి వెనుక నుండి నక్కి నక్కి చూస్తున్న నక్క పిల్ల కనిపించింది దానికి.

"పట్టుకున్నా, పట్టుకున్నా! అవుట్, అవుట్!" అంటూ గబుక్కున నక్కపిల్ల మీద వాలింది కొంగపిల్ల.

"నక్క అవుట్, నక్కబావ అవుట్!" అంటూ బిలబిలా బయటికొచ్చాయి మిగిలిన పిల్లలు.

అన్నీ వచ్చాయి; కానీ చంటి కనిపించలేదు.

"చంటీ! చంటీ!"... ఎంత పిలిచినా రాదే?!

అందరూ ఆదుర్దాగా వెతకటం మొదలు పెట్టారు. "చంటీ!చంటీ!" అని అరిచారు.

అప్పుడు వినిపించింది- "ఊ...ఊ..." అంటూ ఎవరో ఏడుస్తున్న శబ్దం! 'ఎక్కడినుండి వస్తోంది?' అని చూస్తే ఒక తొర్రలోనుండి.



పిల్లలంతా ఆ చెట్టు చుట్టూ గుమిగూడాయి. చెట్టు కాండానికి ఒక చిన్న రంధ్రం ఉంది. ఆ రంధ్రంలోంచి చంటిది ఒక కన్ను సగం ముక్కు మాత్రమే బయటికి రాగల్గుతున్నాయి.

"అసలు ఇంత చిన్న రంధ్రం లోకి నువ్వు ఎలా దూరావే?" అంది బాతు పిల్ల.

"దాక్కునే తొందరలో ఎలానో ఒకలా దూరిందిలే, నువ్వాగు!" అన్నది కుందేలు.

"నన్ను బయటికి లాగండి- ప్లీజ్. నేను రాలేకపోతున్నాను" ఏడుస్తూ అంది చంటి.

"భయపడకు చంటీ- మేమందరం నీకు సాయం చేస్తాం" అన్నారందరూ ఏకకంఠంతో.

"ఆగండాగండి" అందర్నీ నెట్టుకుంటూ ముందుకొచ్చాయి ఉడతపిల్లలు- "చంటీ, మేం మా తోకల్ని తొర్రలోకి పెడతాం. నువ్వు వాటిని గట్టిగా పట్టుకో. అప్పుడు మేం నిన్ను బయటికి లాగుతాం" అని అవి చెప్పగానే చంటి వాటి తోకల్ని గట్టిగా పట్టుకుంది. ఉడతపిల్లలు తమ బలాన్నంతా కూడగట్టుకుని లాగాయి. వాటి తోకలు నొప్పిపుట్టాయిగానీ చంటి మాత్రం బయటికి రాలేదు.

"అమ్మో మావల్ల కాదు బాబోయ్" అంటూ తోకలు పైకెత్తేశాయి ఉడతపిల్లలు.

"ఉండండి- మేం ప్రయత్నించి చూస్తాం" అని

ముందుకొచ్చాయి కొంగపిల్లలు. "చంటీ! మేం మా పొడవాటి ముక్కుల్ని తొర్రలోకి దూరుస్తాం. నువ్వు వాటిని గట్టిగా పట్టుకో. మేం నిన్ను బయటికి లాగేస్తాం" అన్నాయి కొంగపిల్లలు.

తొర్రలో ఉన్న చంటి వాటి ముక్కుల్ని గట్టిగా పట్టుకుంది. బలాన్నంతా ఉపయోగించి బయటికి లాగాయి కొంగపిల్లలు. చంటిమాత్రం బయటికి రాలేదు.

"బాబోయ్, మా ముక్కులు వంకరపోయాయి. ఇక మావల్ల కాదు" చెప్పేసాయి కొంగపిల్లలు.

అంతలో జింకపిల్లకు అద్భుతమైన ఉపాయం ఒకటి తట్టింది- "పిలవండి, పిలవండి- వడ్రంగిపిట్ట పిల్లల్ని పిలవండి" అంటూ అరిచింది.

"ఏంటి అట్లా అరుస్తున్నావు- ఆ పిల్లలేం చేస్తాయి?" అడిగింది గాడిదపిల్ల అమాయకంగా.

"నే చెబుతానుగా, తొందరపడకండి" అంది జింకపిల్ల గర్వంగా. అందరూ అటు ఇటూ పరుగెత్తుకెళ్లి, చివరికి వడ్రంగిపిట్ట పిల్లల్ని పిలుచుకొచ్చారు.

"ఏమిటి? ఏమిటి?" కంగారుగా అడిగాయవి, గుంపులోకి చేరుకొని.

"చూడండి, మన చంటిగాడు పోయి ఈ చెట్టు తొర్రలో ఇరుక్కున్నాడు. అందుకని ఇప్పుడు మీరు ఆ రంధ్రం చుట్టూ తొలవండి. రంధ్రం పెద్దదవుతుంది; దాంతో చంటి బయటికి వస్తాడు!" అంది జింకపిల్ల గొప్పగా. పిల్లలంతా దాని తెలివి తేటల్ని పొగిడారు.

వెంటనే వడ్రంగిపిట్ట పిల్లలు పనిలోకి దిగాయి. వాడిగా ఉండే ముక్కులతో రంధ్రం చుట్టూ తొలవసాగాయి. వాటి చిన్ని ముక్కులు నొప్పి పుట్టేదాకా పొడిచాయి. రంధ్రం కొంచెం పెద్దదయింది- "అమ్మో! మా ముక్కులు నొప్పి పుడుతున్నాయి. మేమింక పొడవలేం బాబోయ్!" అనేశాయవి, ముక్కుల్ని నొక్కుకుంటూ.

"సరేలే, మీరింక పొడవటం ఆపండి. అందరం కలిసి చంటిని బయటికి లాగుదాం" అన్నారు మిగిలినవాళ్లు.

దుబ్బుకోతి తన చేతుల్ని తొర్రలోకి

దూర్చింది. చంటిని గట్టిగా పట్టుకుంది. దాన్ని తొండపిల్ల, ఆ వెనుక కాకి పిల్ల, ఆపై చిరుతపిల్ల- అలా ఒకళ్లనొకళ్ళు పట్టుకుని, గట్టిగా లాగారు. "టప్" మని సీసా మూతిలోంచి బెండు ఎగిరొచ్చినట్లు బయటికి వచ్చి పడింది చంటి!

"హే! హే! మన చంటి బయటికి వచ్చింది" అంటూ పిల్లలంతా నాట్యం చేసారు. బయటికొచ్చిన చంటికి మాత్రం చాలా సిగ్గనిపించింది. తలవంచుకొని, ముఖం ముడుచుకుని నిల్చున్నది.

దాన్ని చూసి 'కూ-కూ' అని కోయిలపిల్లలు, 'కావ్-కావ్' అని కాకి పిల్లలు, 'కిచ్-కిచ్' అని కోతిపిల్లలు, 'కిల-కిల'మని పక్షిపిల్లలు, 'టప-టప' రెక్కలాడిస్తూ కొంగపిల్లలు కడుపుబ్బ నవ్వసాగాయి.

"ఛీ! ఏ ఆటైనా ఆడచ్చు గానీ దాగుడుమూతలు మాత్రం ఆడకూడదు!" అనుకుంది చంటి, 'ఈసారి ఎక్కడ దాక్కుంటే నయమా?..' అని ఆలోచిస్తూ.

అసలు ఏ పనిచేయకుండా బద్ధకించేవాడికంటే ఏదో ఒక పని చేసేవాడు ఉత్తముడు

-వివేకానంద

భర్త: ఏంటే కాంతం! కన్నార్పకుండా సీరియల్ చూస్తున్నావ్, కళ్ళు నొప్పేయట్లేదూ?

భార్య: లేదండీ!. మధ్యలో ప్రకటనలు వచ్చినప్పుడల్లా రెప్పలు ఆర్పుతున్నాగా!

స్నేహితుడు: ఏమోయ్ మోహన్! చాలా రోజులకు కలిశాం. ఏం తీసుకుంటావ్?

రాజు లింగం: సెలవు తీసుకుంటానురా!

స్నేహితుడు: ప్రభుత్వ ఉద్యోగివి అనిపించుకున్నావోయ్!

నవ్వు!

టీచర్: చక్కెర ఇసుకతో కలిసిపోయిందనుకోండి; ఎలా వేరు చేస్తారు?

చంటి: ఏముంది?! నేలమీద ఒంపేస్తే సరి. చీమలు చక్కెరను తిని ఇసుకను వదిలేస్తాయి!



ధృవుడు

పురాణ బాలలు

అమ్మను ఇష్టపడని పిల్లలు ఎవరుంటారు? అమ్మ కష్టాన్ని తీర్చటం కోసం తపించిన ధృవుడి కథ, ఇదిగో..
కథనం: పి. కృష్ణ మూర్తి , విశ్రాంత సహాయ సంచాలకులు-వ్యవసాయ శాఖ, చిత్తూరు జిల్లా.
మార్పు చేర్పులు : కొత్తపల్లి

పూర్వకాలంలో మన దేశాన్ని 'ఉత్తానపాదుడు' అనే రాజు పరిపాలించేవాడు. ఆయనకు సునీతి, సురుచి అని ఇద్దరు భార్యలు.

పెద్ద రాణి సునీతి చాలా సౌమ్యురాలు; దైవభక్తి ఉన్నదీనీ. ఆమె కొడుకు ధృవుడు. వాడు చాలా మంచివాడు; తెలివైనవాడు; అభిమాన ధనుడు.

చిన్న రాణి సురుచేమో అందంగా ఉండేది. రాజుగారికి చిన్న భార్య సురుచి అంటే ఎక్కువ ప్రేమ. రాజ్యంలోనూ, వ్యవహారాల్లోనూ పెత్తనం అంతా ఆమెదే. ఆమె దురుసుతనం చూసి రాజు కూడా ఆమెను ఎదిరించలేక పోయేవాడు. ఆమె కొడుకు పేరు 'ఉత్తముడు'.

ధృవుడు అప్పటికి ఐదేళ్ల పిల్లవాడు. అయినాగానీ తన చుట్టూ జరుగుతున్న అన్యాయాన్ని వాడు కూడా పసిగట్టాడు. తన తల్లి పట్టపురాణి. అయినా ఆమెకు గౌరవం లేదు. తండ్రి, పినతల్లి ఇద్దరూ ఆమెను దాసి

కన్నా చులకనగా చూస్తున్నారు. శాంతం, ఓరిమి గల తల్లి ఆ అవమానాన్నంతా సహిస్తూ, లోలోపలే బాధపడుతున్నది.

ఒకనాడు రాజుగారు అంతఃపురంలో సింహాసనంమీద కూర్చుని, ఉత్తముణ్ణి ఒళ్ళో కూర్చోబెట్టుకుని ముద్దాడుతున్నాడు. అంతలో అటువైపుగా వచ్చాడు ధృవుడు. తండ్రి దగ్గరకు వెళ్లి 'నేను కూడా నీ ఒళ్ళో కూర్చుంటాను' అని అడిగాడు. అయితే చిన్న భార్య సురుచి అక్కడే ఉన్నది. రాజుగారు ధృవుణ్ని దగ్గరకు తీయలేదు- కానీ ధృవుడు తాను కూడా తండ్రి ఒడిలో కూర్చోవాలన్న పట్టుదలతో తమ్ముడిని లాగ బోయాడు.

పినతల్లి అతనిని క్రిందికి ఈడ్చి పడేసింది. "నీకు ఆ అదృష్టం లేదు. నా కడుపున పుట్టిన వాడికే ఆ స్థానం దక్కుతుంది. నీకంత కోరికగా ఉంటే, తపస్సు చేసి దేవుడిని ఉన్నత స్థానం ఇవ్వమని ప్రార్థించుకో- పో" అన్నది ఎగతాళిగా.

ఉత్తానపాదుడు ఏమీ అనలేదు. 'అది వాళ్ల సమస్య' అన్నట్లు ఉత్తముడిని నిమురుతూ కూర్చుండిపోయాడు. తండ్రి అలా మూగగా కూర్చోవటం చూసి ధృవుడికి రోషం, కోపం, ఏడుపు అన్నీ ఒక్కసారిగా వచ్చాయి. ఏడ్చుకుంటూ తల్లి దగ్గరికి వెళ్లాడు.



ఆమె మాత్రం ఏం చేయగలదు? కొడుకు బాధను చూసి ఆ తల్లి తను కూడా ఏడ్చింది.

"పిన్ని చెప్పింది నిజమే నాయనా! నువ్వు నా కడుపున పుట్టటం వల్లనే ఇదంతా. నువ్వే గనక ఆమె కడుపున పుట్టి ఉంటే, ఇంత అవమానం జరిగేదా? అశక్తురాలి కడుపున ఎందుకు పుట్టావు బాబూ? ఆమె చెప్పినట్లు

నీకు ఇక ఆ దేవుడే తప్ప మరో దిక్కులేదు. ఏం చేయాలన్నా ఇక ఆ భగవంతుడిని ప్రార్థించటమే నాయనా!" అని బాధపడింది.



ధృవుడి పసి మనసు ఆ దెబ్బకు నిశ్చేష్టం అయిపోయింది. "ఎంత కష్టమైనా సరే- తపస్సు చేస్తాను. మా అమ్మకు ఉన్నత స్థానం దక్కేలా చేయమని ఆ దేవుడినే అడుగుతాను. దేవుడు కనబడే వరకూ ఇక వెనక్కి తిరిగి రాను" అని నిశ్చయించుకొని, ఐదేళ్ళ ఆ పసివాడు అడవి దారిన బయలుదేరాడు.

పట్టుదల కొద్దీ బయలుదేరనైతే బయలుదేరాడుగానీ, ఐదేళ్ళ పిల్లాడికి తపస్సు గురించి ఏం తెలుస్తుంది పాపం? దారిలో వాడికి నారదమహర్షి ఎదురయ్యాడు. "ఇంత చిన్న పిల్లవాడివి, అడవి దారిన ఎందుకు వెళుతున్నావు నాయనా?!" అని అడిగాడు. నారదుడు చాలా మహత్తులున్న దేవఋషి.

ధృవుడు తన సమస్యను వివరించి, "విష్ణుమూర్తిని గురించి తపస్సు చేద్దామని వెళ్తున్నాను" అన్నాడు.

"అయ్యో, అది అంత సులభం కాదు బాబూ! ఇంత చిన్న పిల్లవాడికి అది సాధ్యం కాదసలు. జరిగింది మర్చిపో నాయనా! కొంతకాలానికి పరిస్థితులు చక్కబడ-తాయిలే" అన్నాడు నారదుడు బుజ్జగిస్తున్నట్లు. కానీ ధృవుడు తన పట్టుదలను వదల్లేదు.

ధృవుడి మనోధైర్యాన్ని మెచ్చుకున్న నారదుడు "నాయనా! తపస్సు అంటేనే నిశ్చలమైన మనసుతో తపించటం. స్థిరంగా తపిస్తే ఫలితం తప్పక కలుగుతుంది. ఇదిగో, స్థిర చిత్తంతో ఈ నారాయణ మంత్రాన్ని

జపిస్తూ పో. నీకు మేలు కలుగుతుంది" అని నారాయణ మంత్రాన్ని ఉపదేశించి, తపస్సు ఎలా చెయ్యాలో నేర్పాడు.

అడవిలోకి వెళ్లిన ధృవుడు తన లక్ష్యం నెరవేరడానికి తగిన ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడు. శరీరాన్ని, మనస్సును తపస్సుకు అనుగుణంగా తయారు చేసుకున్నాడు. మొదటి నెలలో మూడు రోజులకు ఒకసారి- పళ్లు మాత్రం- తింటూ ధ్యానం మొదలుపెట్టాడు. రెండోనెలలో ఆరు రోజులకు ఒకసారి- ఆకులు మాత్రం తిన్నాడు. మూడో నెలలో తొమ్మిది రోజులకొకసారి- మంచినీళ్ళు మాత్రమే తాగుతూ తపస్సు కొనసాగించాడు. ఇక నాలుగో నెల వచ్చే సరికి కేవలం గాలిని మాత్రమే పీల్చుకుంటూ కదలకుండా తపస్సు చేశాడు. ఐదవ నెల వచ్చేసరికి అతని శ్వాస కూడా ఆగిపోయింది! ఆరో నెలలో అతను కాలి బొటనవేలిపైన నిలబడి, మనస్సునిండా శ్రీహరిని నింపుకున్నాడు. గొప్ప గొప్ప యోగులకు, దేవతలకు కూడా అలాంటి తపస్సు సాధ్యం కాదట! అంత నిష్కల్మషమైన మనసు వేరే ఎవ్వరికీ లేదట! చివరికి ఆ భగవంతుడు ఇక ఆగలేకపోయాడు- ధృవుడికి ప్రత్యక్షం అయి, ఏం వరం కావాలో కోరుకొమ్మన్నాడు.



అంత కాలం పాటు మౌనంలో ఉండిపోయిన ధృవుడికి ఏం కోరాలో కూడా అర్థం కాలేదు. చివరికి విష్ణువే "నీకు, నీ తల్లికి అత్యున్నత స్థానం లభిస్తుంది. నువ్వు చాలా కాలం ఈ భరతవర్షాన్ని పరిపాలించి, అటుపైన నక్షత్రమండలంలో శాశ్వత స్థానాన్ని పొందగలవు" అని ఆశీర్వదించి అదృశ్యం అయిపోయాడు.

ఇక ధృవుడు అడవులకు వెళ్ళిన తర్వాత, అక్కడ రాజు ఉత్తానపాదుడిలోనూ, చిన్న రాణి సురుచిలో కూడానూ చాలా మార్పు వచ్చింది. 'పిల్లవాడి మనసుకు అంత గాయం చేశామే, ఉత్తమురాలైన సునీతిని నిర్లక్ష్యం చేశామే' అని పశ్చాత్తాపం మొదలైంది. ధృవుడి కోసం మనుషులని పంపి ఎంత వెతికించినా వాడు ఎక్కడా కనిపించలేదు.

అయితే వాడి తపస్సు ఫలించిందనీ, విష్ణువునుండి వరాలను పొంది తిరిగి వస్తున్నాడనీ తెలియగానే రాజుగారు ఎదురువెళ్ళి ధృవుడిని రాజ్యానికి తీసుకొని వచ్చారు. వాడినీ, తల్లి సునీతిని కూడా అందరూ చాలా ప్రేమగా, అభిమానంగా చూసుకున్నారు.

తండ్రి తర్వాత భరతవర్షానికి ధృవుడు రాజై, అనేక సంవత్సరాలు దక్షతతో పరిపాలించాడు. తమ్ముడు ఉత్తముడిని ఎవరో యక్షులు ఎత్తుకెళ్తే, వారి మీద దండెత్తి, వాళ్ళ రాజు తుంబురుడిని ఓడించి, తమ్ముడిని కాపాడుకున్నాడు.

తర్వాత నక్షత్ర మండలాన్ని చేరుకుని, ధృవతారగా శాశ్వతంగా వెలుగుతూ, ప్రతి రోజూ సూర్యుని కంటే ముందుగా తానే లోకానికి కాంతిని ప్రసాదిస్తూ, తల్లిని పూజించిన వారికి లభించే ఉన్నత పదవికి సాక్షిగా, మనందరికీ దిశానిర్దేశం చేస్తున్నాడు ధృవుడు.

లాయర్: హత్యాప్రదేశంలో దొరికిన గడియారం నీదేనా?

వెంగళప్ప: కాదు.

లాయర్: అక్కడే ఉన్న ఈ పర్సు నీదేనా?

వెంగళప్ప: కాదు.

లాయర్: నీ పేరు?

వెంగళప్ప: నాదే.

నవ్వు!

భాస్కర్: సార్ నా బైక్ పోయింది

పోలీసు: ఎవరి మీదైనా అనుమానం ఉందా?

భాస్కర్: మీ మీదే సార్

పోలీసు: అదేంటి?

భాస్కర్: నేను దాన్ని 'నో పార్కింగ్'లో పెట్టా!



వినాయకుడి పెళ్ళి

మీరు ఎన్నడైనా 'వినాయకుడి పెళ్ళి' గురించి విన్నారా? నా చిన్నప్పుడు మా బాబాయి చెప్పిన ఈ కథ నాకు బలే నచ్చింది!" అని రాస్తున్నారు ఈ అమ్మమ్మగారు. మీరూ చదవండి మరి...
సేకరణ: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, బెంగుళూరు.

వినాయకుడి తమ్ముడు సుబ్రమణ్యం చాలా అందంగా ఉంటాడు. అన్నకంటే ముందు తమ్ముడి పెళ్ళే కుదిరింది. అంగరంగ వైభోగంగా జరిగింది పెళ్ళి. ఎక్కడెక్కడి దేవతలూ సుబ్రమణ్యం పెళ్ళికి విచ్చేశారు.

దాన్ని చూసిన తర్వాత వినాయకుడికీ అనిపించింది- 'తనకూ పెళ్ళైతే బావుంటుంది కదా' అని. పెళ్ళి హడావుడి తగ్గే వరకూ ఆగి, ఆనక అమ్మ పార్వతి ఖాళీగా కూర్చున్నప్పుడు దగ్గరికెళ్ళి నిలబడ్డాడు- "అమ్మా! తమ్ముడి పెళ్ళి చేశావు కదా! మరి నా పెళ్ళి ఎప్పుడు చేస్తావు?" అని అడిగేశాడు.

పాపం పార్వతమ్మ! దిగాలుగా తన ముద్దుల పెద్ద కొడుకు వైపు చూసింది. లోలోపలే బాధపడింది. "చిన్నవాడు సుబ్రమణ్యమేమో

ఎంతో అందంగా ఉంటాడాయె! దాంతో వాళ్ళు పిలిచి పిల్లనిచ్చిరి! మరి, నువ్వేమో ఏనుగు తలతో, పొడవాటి తొండంతో ఉంటివాయె! పోనీలే అంటే, మేం ఎంత చెప్పినా వినక, అందరూ పెట్టిన కుడుములూ ఉండ్రాళ్ళు,వడపప్పు తిని-తిని, అందరూ పోసిన పానకం తాగి-తాగి బొజ్జ పెంచావాయె ! నీకు పిల్లనిస్తామని ఇప్పుడు ఎవరూ ముందుకు రావట్లేదు కద నాన్నా!" అని మనస్సులోనే బాధపడింది.

అయినా ఈ సంగతి పిల్లవాడికి ఎట్లా చెబుతుంది; చిన్నబుచ్చుకుంటాడు గదా. అందుకని పైకి ఏమన్నదంటే- "మరేం బాబూ! నువ్వెళ్ళి, పెళ్ళికూతురి కోసం ఒక కొత్త కోక, మంగళ సూత్రాలూ పట్టుకు రా నాయనా! నేనేమో ఈలోగా పిల్లను చూస్తాను" అని బుజ్జగించి పంపేసి, ఊపిరి పీల్చుకున్నది- "అమ్మయ్య! ఇప్పటికైతే సమస్య తప్పింది!" అనుకుంటూ.

అయితే వినాయకుడికి ఇదేమీ తెలీదు కదా; వెంటనే ఆనందంగా తన ఎలుక వాహనమెక్కి, భూలోకానికి వచ్చేశాడు. వచ్చి అలసిపోయి, ఒక చెట్టు క్రిందున్న అరుగు మీద కూర్చున్నాడు. ఆ అరుగు చుట్టూతా ఏవేవో గింజలు పడి ఉన్నాయట. ఆ సమయంలో అక్కడి గింజలు ఏరుకు తినేందుకు అక్కడికి ఒక కోడిపుంజు వచ్చింది.



వినాయకుడు దాన్ని చూసి "ఓ కోడిపుంజూ! ఒక సారి ఇలా రా!" అని పిలవగానే , 'నన్ను పేరు పెట్టి పిలుస్తున్నారు ఎవరా?'అని దగ్గరకొచ్చింది కోడిపుంజు. చూడగా, అక్కడ అరుగు మీద వినాయకుడు కూర్చొని ఉన్నాడు! దాంతో అది సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బైపోతూ గభాల్న దగ్గరికి వచ్చి, రెక్కలు మడిచి నమస్కరిస్తూ "చెప్పండి

స్వామీ! కులాసానా? నన్ను పిలిచా-రెందుకూ?" అని అడిగింది.

"ఓహో, కోడిపుంజూ! నీ రెక్కలు ఎంత అందంగా ఉన్నాయ్! నీజుట్టు కిరీటంలాగా ఎంత బావుంది! నువ్వు చెప్పిన పనల్లా చాలా చక్కగా చేస్తావనీ, సమయ పాలన అంటే ఏంటో నీనుండే నేర్చుకోవాలనీ అందరూ చెబుతుంటారు! మరి నువ్వు నాకూ ఓ పని చేసి పెడతావా? చక చకా వెళ్ళి, నాకో కొత్త కోక తెచ్చిపెట్టు; మా అమ్మ నాకు పెళ్ళి చేస్తుందిట!"అన్నాడు.



"అంత పెద్ద స్వామి తనను పొగిడాడే!" అని కోడిపుంజు చాలా సంతోషించింది. "దానిది ఏముంది స్వామీ! ఒక్క నిముషంలో పెద్ద బజారు కెళ్ళి, 'వినాయకుడి పెళ్ళికి కొత్త కోక కావాలి' అని అడిగి తెచ్చేస్తా స్వామీ! ఇక్కడున్నట్లే వచ్చేస్తాను" అని వేగంగా వెళ్ళిపోయింది కోడి! .

అంతలో అక్కడ మొలిచి ఉన్న పచ్చగడ్డిని తినేందుకు గొర్రెపోతు ఒకటి అటుగా వచ్చింది.

దాన్ని చూసి వినాయకుడు బలే మురిసిపోయాడు- 'ఈరోజు అన్నీ మంచి శకునాలే! నేను తిరక్కుండానే అన్ని పనులూ ఎట్లా అయిపోతున్నాయో చూడు!" అని సంతోషపడ్డాడు. "ఓ గొర్రెపోతూ! నాకో పని చేసి పెట్టరాదూ? త్వరలో నా పెళ్ళి జరగనున్నది! దానికోసం నువ్వు కంసాలి దగ్గరికెళ్ళి మంగళ సూత్రాలు చేయించుకురా, వెంటనే వెళ్ళు!" అని చెప్పాడు.

గొర్రెపోతు "ఓహో! అట్లానా స్వామీ! అయితే మాకు పప్పన్నం దొరుకుతుందన్నమాట! ఇదిగో! ఇప్పుడేవెళ్ళి తెస్తాను. అదెంతలోకి! మీరడిగారని చెప్పి ఇప్పుడే కంసాలి దగ్గరికి

వెళ్ళి పట్టుకు వచ్చేస్తాను చూడండి!" అంటూ వెళ్ళింది.

వినాయకుడు అక్కడే ఓ కునుకు తీసాడు. ఆయన లేచి చూసేసరికి సాయంకాలమైంది. పోయిన వాళ్ళు ఇద్దరూ ఇంకా తిరిగి రాలేదు! ఇక దాంతో వినాయకుడే మెల్లిగా ఎలుక వాహనం ఎక్కి బయల్దేరాడు- ఇద్దర్నీ వెతుక్కుంటూ.

కొంతదూరం వెళ్ళే సరికి కోడిపుంజు కనిపించింది. "ఏమే, కోడిపుంజూ ! నా కొత్త కోక ఎక్కడ?" అని అడిగాడు దాన్ని.

అదన్నది- "స్వామీ! మీకోసం కొత్త కోక తీసుకు వస్తున్నానా, అంతలో అక్కడ నాకు ఒక జొన్నకంకి కనిపించింది. దాన్ని చూడగానే విపరీతంగా ఆకలేసింది. 'ఒక్క కంకి తినేసి వద్దాం' అని మీ కొత్త కోకను పక్కన పెట్టి, కంకి తినేసి వచ్చాను- చూస్తునుగదా, కోక లేదు! దాంతో ఇక మధ్యాహ్నం నుండీ దాన్నే వెతుకుతూ తిరుగుతూ ఉన్నానయ్యా" అని.

వినాయకుడన్నాడు- "చూడు కోడిపుంజూ, నువ్వు కొత్త కోక తీసుకువస్తేనే నా పెళ్ళి! అందుకని త్వరగా వెళ్ళి వెతుక్కు రా! లేకపోతే ఎలుక చేత నిన్ను కొరికించేస్తా, జాగ్రత్త!" అని బెదిరించాడు. దాంతో కోడిపుంజు 'కొత్తకోకో'అని అరుచుకుంటూ, ఆ కొత్తకోక కోసం ఈనాటికీ వెతుకుతూనే ఉంది, పాపం! ఆ అరుపేనట, మనకు 'కొక్కొరోకో' అని వినబడేది!

కోడిపుంజు కోక తేకపోయేసరికి, 'ఇక సరేలే' అని వినాయకుడు గొర్రెను వెతుకుతూ ఆ బజారూ ఈ బజారూ తిరిగాడట. అనుకున్నట్లుగానే, గొర్రెపోతు ఎదురైంది. స్వామి కోపంగా "ఏయ్ గొర్రెపోతూ! నా తాళి బొట్టెక్కడ?" అనగానే, అది వణికిపోతూ "స్వామీ! తమరు అడిగారని చెప్పగానే కంసాలి కనకయ్య తాళిబొట్టు చేసి ఇచ్చేశాడు; ఆ తర్వాత వస్తూ వస్తూంటే నాకు ఆకలేసింది; ఆ సజ్జచేలో గడ్డి తింటూ ఒక్క క్షణం ఏమారాను- అంతలోనే ఎవరో ఆ తాళిబొట్టు కాజేశారయ్యా" అని భయపడుతూ చెప్పింది గొర్రెపోతు.

వినాయకునికి మహా కోపం వచ్చేసింది. "నువ్వు త్వరగా వెతికి తెచ్చివ్వు. నా పెళ్ళి

జరగాలంటే ఆ తాళి కావాల్సిందే!" అనేశాడు హుంకరిస్తూ.

"అట్టాగే స్వామీ!" అని గొర్రెపోతు పాపం, ఆనాటి నుండీ ఈనాటి వరకూ వంచిన తల ఎత్తకుండా ఆ తాళిబొట్టు కోసం వెతుకుతూనే ఉంది. అయినా ఏం చేస్తాం, ఈరోజు వరకూ కూడా అటు తాళిబొట్టు కాని, ఇటు కొత్తకోక గానీ రానే లేదు!

దాంతో మరి వినాయకుడి పెళ్ళి జరగనే లేదు. పైపెచ్చు 'వినాయకుని పెళ్ళికి వెయ్యి విఘ్నాలు' అన్న సామెత పుట్టింది.

మరి మీకేమైనా కొత్తకోక గానీ తాళిబొట్టు కానీ దొరికితే తెచ్చివ్వండేం! అప్పుడు జరిగే వినాయకుడి పెళ్ళికి మనమూ వెళ్లచ్చు; కావల్సినన్ని కుడుములూ ఉండ్రాళ్ళూ బలేగా తినచ్చు!

వనజ: ఏం వదినా?! ఇంటింటికీ వెళ్ళి పలకరిస్తున్నావెందుకు?

సునిత: నిన్న మా అమ్మాయి అమెరికానుండి ఫోను చేసి అందరినీ అడిగినట్లు చెప్పమన్నది కదా, అందుకని.

లాయర్ విశ్వనాధం ఇంటికి ఒక బిచ్చగాడు వచ్చాడు-

బిచ్చగాడు: అయ్యా!ధర్మం

లాయర్: ఇదిగో, ఈ వంద రూపాయలు తీసుకొని పో.

లాయర్ భార్య: ఏంటండీ! బిచ్చగాడికి వందరూపాయలు ఇస్తారా ఎవరైనా?

లాయర్: పోనీలేవే! వాడు ఒకప్పుడు నా క్లయంటే. నా ఫీజులు ఇచ్చీ ఇచ్చీ ఇట్లా అయ్యాడు పాపం.

యస్ కె అష్ఫిన్,
తొమ్మిదోతరగతి, తేజ
విద్యాలయం చెప్పిన జోకులు:



వెంగళప్ప భార్య కథ

మూలం: శ్రీ బాబా కె, సౌజన్యం: పర్తాప్ అగర్వాల్

అనగనగా ఒక ఊళ్ళో ఓ వెంగళప్ప ఉండేవాడు. ఏవేవో కబుర్లు చెప్పి అందరినీ నవ్విస్తూ, తనూ నవ్వుతూ ఉండే వెంగళప్ప అంటే పడి చచ్చేవాళ్ళు ఊళ్ళోని కుర్రకారు. ఎనభై ఏళ్లకు పైబడ్డా వెంగళప్పలోని ఉత్సాహం, హాస్యం ఏమాత్రం తగ్గలేదు మరి.

ఒకసారి అట్లా చుట్టూ చేరిన కుర్రవాళ్ళకు తను సొంతగా చేసిన 'టీ' తెచ్చి ఇస్తుంటే ఓ కుర్రవాడు అడిగాడు- "తాతా! ఇన్నేళ్ళుగా నువ్వు మాకందరికీ ఇన్నిన్ని సంగతులు చెబుతున్నావు. అయితే మొహమాటం కొద్దీ ఇంతకాలంగా మేం ఎవ్వరమూ అడగని ప్రశ్న ఒకటుంది- 'నీదంటూ ఒక కుటుంబం ఎందుకు లేదు? నీ భార్య ఏమైంది? నీ పెళ్ళి ఎలా జరిగింది? ఇప్పుడైనా చెప్పు!'అని.

"ఓ, దానిదేముంది, చెబుతాను- ఐతే ఆది చాలా పెద్ద కథ!"అని మొదలెట్టాడు వెంగళప్ప.

"ఒకసారి నా చదువు పూర్తై, పనిలో చేరాక- మీ అంత వయస్సులో ఉన్నప్పుడు- పెళ్ళి చేసుకోవాలని చాలా గట్టిగా అనుకున్నాను. "ఎలాంటి భార్య కావాలి? ఆ అమ్మాయి ఎలా ఉండాలి? ఏ ప్రాంతపు మనిషి అయి ఉండాలి?..." అని రకరకాలుగా

ఆలోచించాను..

"అమ్మాయి సన్నగా, నాజూకుగా ఉండాలి; పొడుగ్గా ఉండాలి కూడాను- ఆమె నల్లటి కళ్లు విశాలంగా, నక్షత్రాల్లా మిల మిలా మెరుస్తూ ఉండాలి. ఆమె చర్మం ఎలాగైనా తెల్లగా ఉండాల్సిందే; దాంతో పాటు పొడవాటి జుట్టూ ఉండాలామెకు.



బాగా చదువుకొని ఉండాలి; సంగీతం వచ్చి ఉండటమే కాక ఒకటో రెండో సంగీత సాధనాలు వాయించగలిగి ఉండాలి- సాయంత్రం వేళల్లో నేను అలా కూర్చొని ఉంటే నేపథ్యంలో సంగీతం వాయించేట్లుండాలన్నమాట!

ఇక ఆమె మంచి వంటకత్తె కూడా అయి ఉండాలి కదా, లేకపోతే నాకు వంట ఎలాగ?! ఇంకా ఆమె వంశం గొప్ప పేరెన్నిక గన్న వంశం అయిఉండాలి.

ఆమె ఎక్కువ సీరియస్‌గా ఉండకూడదు; పెద్దలంటే గౌరవం, మర్యాద ఉండాలి. ఆమె ముక్కు మరీ పెద్దగా ఉండకూడదు- ఇంకా ఆమెకు సొంత తెలివితేటలు ఉండాలి- ఎప్పుడూ ఇతరులకు లోబడి ఉంటే ఎలాగ..? నాకు కాబోయే భార్య సకల సద్గుణ సంపూర్ణ అయి ఉండాలి"

"అట్లా అన్నీ ఆలోచించాక, నేను నా గుర్రాన్నెక్కి బయలుదేరాను- దేశమంతటా తిరిగి, నాకు కాబోయే భార్యను వెతుకుదామని. 'నా కలల రాణి, పరిపూర్ణ సులక్షణ- ఎక్కడో ఉండి ఉంటుంది; నాకోసమే ఎదురు చూస్తూ ఉంటుంది" అని నాకు చాలా గట్టిగా అనిపించింది.

నేను ఆగిన మొదటి పట్టణంలోనే ఒక అమ్మాయి కనిపించింది నాకు. అద్భుతమైన

అందం! నల్ల కలువల్లాంటి కళ్ళు. ఎత్తుగా, చాలా తెల్లగా ఉంది. గొప్ప వంశంలో పుట్టింది, చాలా ఆకర్షణీయంగా ఉందామె-"

"ఓహో!" సంతోషంగా అరిచారందరూ. "మొత్తానికి త్వరగానే దొరికిందన్నమాట!" అని.



"అయ్యో, అట్లాంటిదేం లేదు. ఆమెకు సంగీతమే రాదు! నిజానికి, ఆమె ముక్కు కూడా కొంచెం దుబ్బగానే ఉండింది.."

"అందుకని నేను మరో పట్టణానికి వెళ్ళాను. అక్కడున్న మిత్రులు కొందరు నన్ను మరో కుటుంబానికి పరిచయం చేశారు- చాలా గొప్ప కుటుంబం, చక్కని అందమైన కూతురు! ఆమె ఎంత చక్కగా ఉందంటే, ఎంత ఉన్నతమైన ప్రవర్తన- చెప్పలేం. ఇక సంగీతం అయితే, ఆమెకు దేవుడిచ్చిన వరమే! అన్నిటినీ మించి, ఆమె తల్లిదండ్రులు నాకు పూర్తి భరోసా ఇచ్చారు- ఆమె అద్భుతమైన వంటగత్తె కూడా!

"భలే భలే!" చప్పట్లు చరిచారు కుర్రవాళ్ళు "ఇంక ఏమైంది అప్పుడు?"

"ఏమీ కాలేదు!" చెప్పాడు వెంగళప్ప- "ఆ అమ్మాయి, నిజానికి కొంచెం దుబ్బగా ఉండింది- కొంచెం పొట్టిగా కూడా"

"అయ్యో!" అన్నారంతా "మరి ఇంకేం చేశావు?"

"ఏముంది, గుర్రమెక్కి బయల్దేరాను మళ్ళీ. ఈసారి మా సొంత ఊరుకెళ్ళాను. అక్కడ మా బంధువులు నన్నొక అద్భుతమైన యువతికి పరిచయం చేశారు- ఆమెను గురించి చెప్పాలంటే మాటలు చాలవు! ఏం అందం, ఏం చందం, ఏం వ్యక్తిత్వం! ఎంత చురుకుదనం, ఎంత ప్రశాంతత, ఎత్తుగా,

హుందాగా, తెల్లగా దేవకన్యలాగా మెరిసిపోతూ! చక్కని సంగీతం, చదువు- నా భార్యలో నేను కోరుకునేవన్నీ ఉండినై ఆమెలో! ఎట్టకేలకు నాకు నేను మెచ్చిన యువతి ఎదురైంది!

"అద్భుతం! అదృష్టం అంటే నీదే" అరిచాడో కుర్రాడు.

కానీ వెంగళప్ప ముఖం దిగాలుగా వేసుకొని కూర్చున్నాడు- ఇంకేమీ చెప్పలేదు.

"ఏమైంది!? ఏమైందప్పుడు? చెప్పు, ఇట్లా ఆత్రంలో ముంచి వదిలేస్తే ఎలాగ?" రకరకాలుగా అరిచారు కుర్రాళ్లంతా.

"కానీ ఏం చెప్పాలి, ఆమె కూడా తన కలల రాజు కోసం ఎదురు చూస్తున్నదట మరి!" అన్నాడు వెంగళప్ప, చల్లగా!

టీచర్: ఏమైంది కిట్టూ? ఎందుకట్లా కట్టె పట్టుకొని నడుస్తున్నావ్?

కిట్టూ: మీరే కద టీచర్, చెప్పింది- గాంధీగారి అడుగుజాడల్లో నడవాలని?

టీచర్: అర్థ శాస్త్రం అంటే ఏంటిరా, చింటూ?

చింటూ: పూర్తిగా కాకుండా సగమే చెప్పిన శాస్త్రం సార్!

అధికారి: నేను యమ్మే చదివాను. మీరెంతవరకూ చదువుకున్నారు?


వెంగళప్ప: రాత్రి తొమ్మిదింటి వరకు

అధికారి: మీరు ఎంతవరకూ చదువుకున్నారు?

వెంగళప్ప: పెద్దయ్యే వరకు.

సురేష్: స్నేహితుడిపై ఎంత ప్రేముంటే మాత్రం అతడిని మిత్రమా, దోస్త్, నేస్తమా అంటూ రకరకాలుగా పిలుస్తున్నావేంటి?

నరేష్: అబ్బే.. అదేమీ లేదు. వాడి పేరు మర్చిపోయానంతే.



సుఖవతి కథ

బౌద్ధ కథ

మూలం : Buddhist tales *అనుసరణ*: *నారాయణ*



దాదాపు 2600 సంవత్సరాల క్రితం బుద్ధుడు జీవించి ఉన్నకాలంలో, శ్రావస్తీ నగరంలో ఒక ముసలి బిచ్చగత్తె ఉండేది. ఆమె అసలు పేరు ఏంటో ఎవ్వరికీ తెలీదు కానీ, ఆమె ఎప్పుడూ సంతోషంగాఉండటం చూసి అందరూ ఆమెను సుఖవతి అని పిలిచేవాళ్ళు.

ఒకనాడు సుఖవతి నగర వీధుల్లో అడుక్కుంటుంటే వినబడింది- "భగవానుడైన బుద్ధుడు త్వరలోనే శ్రావస్తికి రానున్నాడు" అని. ఆమె పెద్దగా చదువుకున్నదీ కాదు; ఏమంత తెలివితేటలు ఉన్నదీ కాదు. బుద్ధుడి గురించి ఆమె అంతవరకూ ఏనాడు విని ఉండలేదు కూడా. అయినా 'బుద్ధుడు రావటం' అనే సంగతి మటుకు ఆమెకు ఎందుకో చాలా నచ్చింది.

తర్వాతి రోజుల్లోఆమె బుద్ధుడి గురించి అనేక విషయాలు విన్నది- "రాజకుమారులనుండి, పెద్ద పెద్ద

వర్తకులనుండి, అతి సామాన్యుల వరకూ- అందరూ ఆయన రాక కోసం ఎదురు చూస్తున్నారు! ఆయన కోసం ఎవరి తాహతుకు తగినట్లు వాళ్ళు ఏవేవోబహుమతులు తీసుకు వెళ్తారు. ఆయన మటుకు ఎవ్వరు ఏది ఇచ్చినా తీసుకుంటాడు. అసలైతే ఆయనకు శ్రద్ధ తప్ప మరేమీ అక్కర్లేదట.." ఇట్లా ఏవేవో చెప్పుకుంటున్నారు జనం.

సుఖవతి తనకు తెలియకుండానే బుద్ధుడి రాక కోసం ఎదురు చూడటం మొదలు పెట్టింది. అడుక్కుంటూ నగర శివార్ల వరకూ పోయి, అక్కడే సాయంత్రం వరకూ ఉండి, వెనక్కి తిరిగి వచ్చేది.

కొన్ని రోజుల తర్వాత బుద్ధుడు వచ్చాడు. సుఖవతి ఆ సమయానికి నగరం శివారులోనే ఉన్నది. బుద్ధుడి వెంట అనేకమంది భిక్షువులు- అందరూ చకచకా నడచుకొంటూ సుఖవతిని దాటుకొని పోయారు. బుద్ధుడు తనని చూసి చిరునవ్వు నవ్వినట్లు, "నా వెంట రా" అని చెప్పినట్లు అనిపించింది సుఖవతికి. ఆమె మనసు పులకరించి, ఆయన వెంటే పోయింది. ఆమె కాళ్ళు మటుకు ఆయన్ని అనుసరించలేక వెనుక పడ్డాయి.

తెలివి వచ్చి చూసుకునేసరికి సుఖవతి నగరంలో ఉన్నది. సాయంత్రపు చీకట్లు ముసురుకుంటున్నాయి. బుద్ధుడిని దర్శించుకునేందుకు వచ్చిన వాళ్ళతో నగర వీధులన్నీ కిటకిటలాడుతున్నాయి.



ఎక్కడ చూసినా స్వాగత తోరణాలు, సందడి. అందరి చేతుల్లోనూ పూలు, పళ్ళు, ధూపాలు, వస్త్రాలు, రక రకాల తినుబండారాలు- అన్నీబుద్ధునికి-అతని అనుచరులకు బహుమానంగా ఇచ్చేందుకు! వాటిని చూసేసరికి సుఖవతికి అకస్మాత్తుగా

తను ఏమీ తేలేదని గుర్తుకొచ్చింది. 'అంత గొప్ప భగవానుడిని ఒట్టి చేతుల్తో దర్శించటం ఏం బాగుంటుంది?' అనిపించింది. తన దగ్గర ఏమున్నదో వెతుక్కున్నది. ఒక చిన్న నాణెం మాత్రం ఉంది. ఆ నాణాన్ని పట్టుకొని ప్రక్కనే కనబడ్డ శెట్టి దుకాణానికి పోయింది. నాణానికి సరిపడ నూనె ఇమ్మన్నది.

ఆ నాణెం ధరకు అసలు ఏ కొంచెం నూనె కూడా రాదు. సుఖవతి తన కొంగును కొంచెం చింపి ఇచ్చింది- "ఇదిగో, ఈ పీలిక తడిసేంత నూనె ఇవ్వు చాలు. భగవానుడి ముందు దీపం వెలిగిస్తాను" అని ప్రాధేయపడ్డది.

'బుద్ధుడికోసం' అనేటప్పటికి శెట్టి మెత్తబడ్డాడు. పీలికని నూనెలో తడిపి ఇచ్చాడు. సుఖవతి దాన్నిపట్టుకొని పోయి, బుద్ధుడు బస చేసిన ఆరామానికి చేరుకున్నది. అక్కడ ఇసకేస్తే రాలనంత మంది జనం. అక్కడ ఓ మూలగా మట్టి ప్రమిద ఒకటి కనబడితే, దానిలో ఈ ఒత్తిని వేసి వెలిగించింది ఈమె.

దానిముందు మోకరిల్లి, "బుద్ధుడా! నీకిచ్చేందుకు నా దగ్గర ఈ చిన్న దీపం తప్ప వేరే ఏదీ లేదు. అయినా నేను వెలిగించిన ఈ దీపం చీకట్లను పారద్రోలాలి. ఇక్కడున్న వీళ్లందరికీ అంతులేని జ్ఞానం లభించేందుకు ఇది సాయపడాలి. అజ్ఞానపు పొరలన్నీ నశించి, అంతటా వెలుగు పరచుకోవాలి" అనుకున్నది.



ఆరోజు రాత్రి ఆరామంలోని దీపాలన్నీ ఒక్కటొక్కటిగా కొడిగట్టాయి. కానీ అడుక్కుతినే ఆమె వెలిగించిన దీపం మటుకు తెల్లవారవచ్చినా ఇంకా వెలుగుతూనే ఉన్నది.

తెల్లవారు జామున దీపపు ప్రమిదలన్నిటినీ

సేకరించి ఒకచోట పేర్చేందుకు వచ్చిన 'మౌద్గలాయనుడు' అనే శిష్యుడు దాన్ని చూసి "దీపంలోఒత్తి ఇంకా కొత్తగానే ఉన్నది. ఉదయంపూట దీనితో పనిలేదు. ఇవాల్టి రాత్రికి మళ్ళీ వెలిగించుకోవచ్చు" అని దాన్ని ఆర్పివేయబోయాడు.

అతను ఎన్ని సార్లు ఆర్పివేసినా ఆ దీపం మళ్ళీ మళ్ళీ వెలుగు అంటుకున్నది!

దీన్ని గమనించిన బుద్ధుడు నవ్వి, అతన్ని వారిస్తూ "ఇది ఇప్పట్లో ఆరదు. సుఖవతి వెలిగించిన ఈ జ్ఞాన దీపం ఆమెకే కాదు; అనేకమందికి ఆసరా అవుతుంది. ఈ జ్ఞానాగ్నిలో అనేక జీవుల కర్మలు సమూలంగా నశించనున్నాయి. పవిత్రమైన హృదయంతో, బలమైన సంకల్పంతో వెలిగించిన ఈ దీపంవల్ల ఆమె ఈ సరికే పరిశుద్ధురాలైంది. తన సొంత తపస్సు ఫలితంగా ఆమె రానున్న కాలంలో 'దీపకాంతి' అనే పేరు గల బుద్ధుడు అవుతుంది" అన్నాడు.

మనం చేసే పనులకు బలాన్ని చేకూర్చేది మన మనసులోని పవిత్రతే!

టీచర్: ఒరేయ్ చింటూ, FORD అంటే ఏంటిరా?

చింటూ: అది ఒక బండి పేరు సార్.

టీచర్: గుడ్. మరి OXFORD అంటే ఏంటిరా?

చింటూ: అది ఎడ్లబండి అయిఉండచ్చు సార్.

-మహమ్మద్ ఇమ్రాన్ హుసేన్, ఎనిమిదో తరగతి, తేజ విద్యాలయం

నవ్వు

టీచరు : మెదడువాపు వ్యాధి గురించి మనం ఎందుకు పట్టించుకోవాలి?

హరి: మనకు మెదడుంది కదా, టీచర్?... అందుకే!!

మీరేదైనా కథ రాశారా, సొంతగా? మీరేదైనా బొమ్మ వేశారా? కొత్తపల్లికి పంపండి. బాగుంటే ప్రచురిస్తాం!

చిట్టి పాటలు

గానం: పూజిత, ఒకటోతరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.

1. అనగనగా రాజు!



అనగగా రాజు

పెడతాడు పెద్ద పోజు

మూరెడుమూరెడుమీసాలు

బారెడు బారెడు గడ్డాలు

గుర్రాలమీద సవారీ

పోలీస్ చూస్తే పరారీ!

2. జున్ను వెన్న!



జున్ను వెన్న తెల్లన

దున్నపోతు నల్లన

అన్న పేరు ఎర్రన్న

నా పేరు పుల్లన్న

3. లేలేత మొగ్గ

లేలేత మొగ్గ
విచ్చితే పువ్వు
కాసితే కాయ
మెక్కితే పండు
తింటే తియ్యన
నీకింతా ఇయ్యను



పదరంగం-71 సమాధానం

1 ల్లు	2 హ		3 హా	ర	4 ము
	5 లం	6 క			రా
7 డు		8 థ		9 త	రి
10 తు	మ్ము	లు		రు	
ర			11 గు	పు	12 త
13 భ	ర్తృ	హ	రి		ల

ఈ సమాధానాన్ని సరిగా వ్రాసి పంపిన ఆరో తరగతి అబ్బాయి చి॥ కె.యం.యం.శ్రీవంత్ (హైదరాబాదు)కు అభినందనలు! తనకి ఈ మాసపు కొత్తపల్లిని బహుమతిగా పంపిస్తున్నాం. మీరూ ప్రయత్నించండి- ఈ సంచిక చివరలోని పదరంగం 72 మీకోసమే ఎదురు చూస్తున్నది, మరి!

వైష్ణవ జనతో

పాట నేర్చుకుందాం!

అసలు దైవ భక్తుడంటే ఎవరు ? అది తెలియజెప్పే ఈ గుజరాతీ గీతం అంటే గాంధీజీకి చాలా ఇష్టం. ఇంటర్నెట్లో http://kottapalli.in *నుండి ఈ పాటని డౌన్లోడు చేసుకొని నేర్చుకోండి ఇంక !*
రచన: నర్సీ మెహతా, పదిహేనవ శతాబ్దం. సంగీతం, స్వర కల్పన : పేరి శ్రీరామ మూర్తి గారు
సేకరణ, గానం: సుష్మ, సౌమ్య నిట్టల, ఆరోహి మ్యూజిక్. గిటార్ : శామ్యూల్ కిరణ్ కుమార్

గుజరాతీ మూలం:

వైష్ణవ జనతో తేనే కహియె జే
పీడ్ పరాయీ జాణేరే
పర దు:ఖే ఉపకార్ కరే తో జే
మన అభిమాన్ న ఆణేరే
। వైష్ణవ ।

సకలలోక మా సహునే వందే
నిందా న కరే కేణీ రే
వాచ్ కాచ్ మన్ నిశ్చల రాఖే
ధన్ ధన్ జననీ తేనీ రే
। వైష్ణవ ।

అర్థం:

ఎవరైతే ఇతరుల దు:ఖాన్ని అర్థం చేసుకొని వాళ్లకు మేలు చేస్తాడో, ఎవరైతే గర్వాన్ని తన మనసులోకి చొరనివ్వడో- అట్లాంటి వాడే నిజమైన భక్తుడు.

సకలలోకాన్నీ ఎవరైతే సహనంతో గౌరవిస్తాడో,
అసలు ఎవ్వరినీ నిందించకుండా ఉంటాడో,
మాటనీ-చేతనీ-మనసునీ నిశ్చలంగా ఎవరైతే ఉంచుకుంటారో,
అట్లాంటి ఓ భక్తుడా! నీ తల్లి జన్మ ధన్యం.

సమదృష్టీ నే తృష్ణా త్యాగే
పర స్త్రీ జే నే మాత రే
జిహ్వా థకీ అసత్య న బోలే
పరధన్ న వఝాలే హాథ్ రే
। వైష్ణవ ।

ఎవరిలోనైతే అన్ని ప్రాణులపట్లా సమదృష్టి ఉంటుందో, ఎవరైతే ఆశను జయిస్తారో, పరస్త్రీని ఎవరైతే తల్లిగా చూడగల్గుతారో, నాలుక పలికీ పలికీ అలసిపోయినా సరే- ఎవరైతే అబద్ధం అన్నది ఎరుగరో, ఇతరుల డబ్బును ఎవరైతే ముట్టుకోనుకూడా ముట్టుకోరో- అట్లాంటి వాడే అసలైన భక్తుడు.

మోహ మాయా వ్యాపే నహి జే నే
దృఢ వైరాగ్య జేనా మన్ మారే
రామ నామ సూ తాలీ రే లాగీ
సకల తీర్థ తేనా తనమా రే
। వైష్ణవ ।

ఎవరినైతే మోహం, మాయ అస్సలు లోబరచుకోలేదో, దృఢమైన వైరాగ్యంతో ఎవరైతే మనసును అదుపులో ఉంచుకున్నారో, రామనామం అనే అమృతానికి ఎవరైతే దాసులైపోయారో, సకల తీర్థాలనూ ఎవరైతే తన మనసులోనే దర్శిస్తుంటారో -అట్లాంటివారే అసలైన భక్తులు.

వణ లోభీ నే కపట రహిత ఛే
కామ క్రోధ నివార్యా రే
భణే నరస్సైయో తేనో దరశన్ కర్‌తా
కుల్ ఏకో తర తార్యా రే
। వైష్ణవ।

ఎవరిలోనైతే లోభం, కపటం ఏమాత్రం లేవో, ఎవరైతే కోరికనీ, క్రోధాన్నీ వదిలిపెట్టగలిగారో, నర్సీకవి ఎవరిని దర్శించేందుకు ఇష్టపడతాడో, ఏ ఒక్కరి పుణ్యం వల్ల అతని వంశం అంతా ముక్తినొందుతుందో- అట్లాంటివాడే నిజమైన దైవభక్తుడు.

పదరంగం-72

నిర్వహణ: డా. సిరి, మిర్యాల గూడా, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం

1				2	3
			4		
5		6		7	
		8	9		
10	11		12	13	14
	15				

అడ్డం

1. మహమ్మదీయుల అతి పెద్ద పండుగ(3)
2. అటు నుండి వచ్చిన 'గోవు'(2)
4. ఓటమి కాదు!(3)
5. ఉప్పునే ఇలా అంటారు(3)
7. 'సుస్వరం'లోని మధ్యాక్షరం మాయమ్మైంది(2)
8. మహాత్మాగాంధీని అందరూ ప్రేమగా ఇలా పిలుస్తారు(2)
10. తిరగబడిన పట్నం (2)
12. పూతరేకులు లోని చివరి మూడక్షరాలు కుడి ఎడమయ్యాయి(3)
15. మరో విధంగా సూర్యుడు(5)

నిలువు

1. జాతరలో ఉంటుంది, పిల్లాపెద్దలంతా ఇష్టంగా ఎక్కుతారు(5)
2. సులభానికి ఇంకోపేరు, తలక్రిందులైంది(3)
3. దేవాలయ శిఖరం(3)
6. గురి చూసి వేసేది, అటు నుండి వచ్చింది(2)
9. పొలంలో పెరిగే పిచ్చి మొక్కలు తిరగబడ్డాయి(3)
11. దశాబ్దం అంటే, ఇన్ని సంవత్సరాలు?(2)
13. పాండవులు ఈ వంశానికి చెందినవారు(2)
14. 'రాజు'ని ఇలా కూడా అంటారని మీకు తెలుసా?(2)

అడ్డం-నిలువు ఆధారాల సహాయంతో ఈ గడులను నింపగలరేమో చూడండి. నింపిన పదరంగాన్ని, కేవలం పోస్టుకార్డుపై రాసి, మాకు అందేట్లు పంపండి. మీ బడి పేరు, తరగతి, మీవాళ్ల ఫోను నంబరు తప్పక రాయండి. సరైన సమాధానం రాసి ఎంపికైన ముగ్గురు పిల్లలకు కొత్తపల్లి-74 ని బహుమతిగా పంపిస్తాం!

పదాల్ని వెతికి పట్టుకోండి!

సంతోషం, వానలు, వరదలు, తుఫానులు, అల్పపీడనం, అనువుగానిచోటు, అధికుడు, కొంచెము, ఉండుట, కొదువ, విత్తనం, మఱ్రివృక్షం, చలికాలం, కందిపప్పు, వికాసం, అప్పు, గురజాడ, దీపావళి, నరకాసురుడు సత్యభామ- ఈ పదాలన్నీ క్రింది పట్టికలో దాగున్నాయి- నిలువుగా, అడ్డంగా, వాలుగా, క్రిందినుండి పైకి- ఎటుపడితే అటు! వాటిని వెతికి పట్టుకోండి! వాటి చుట్టూ గుండ్రాలు గీయండి చూద్దాం!

కొ	డు	రు	సు	కా	ర	న	షం	దీ	న	ర	కం
సం	దు	చో	డు	చె	షం	వ	ర	ద	పా	వ	ది
వ	ళి	కు	టు	ప్పు	ధి	తో	వ్ప	క్షం	లం	వ	మ
సు	ధి	వృ	ఉం	లం	కొం	ద	సం	పా	ల్ప	ర్రి	ళి
అ	ను	వు	డు	కా	వృ	పీ	కా	దీ	వృ	భా	కొం
న	ల్ప	డ	ట	లి	ల్ప	సం	వి	క్షం	ర్రి	ప్పు	టు
వా	ల	పీ	ద	చ	ఫా	వి	లు	ద	ర	వ	చో
గు	ర	జా	డ	సు	త్త	కం	ది	ను	ఉం	దు	ని
ర్రి	ళి	ఫా	ర్రి	నం	ది	మ	ర్రి	సం	ఫా	కొ	గా
ము	సం	త్త	మ	ప	ల్ప	లు	భా	మ	ను	తు	వు
చె	షం	డ	ప్పు	అ	న	భా	ప్పు	త్య	పా	డ	ను
కొం	వ్ప	క్షం	జా	వా	ర్రి	ప	భా	దీ	స	త్య	అ

తెలుసుకుందాం!

నిర్వహణ: కొత్తపల్లి

కుడంకులం అణువిద్యుత్ కేంద్రం



తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలో నిర్మించబడుతున్న కుడంకులం అణువిద్యుత్కేంద్రం 'నీటి ఒత్తిడితో పనిచేసే తేలికరకం రియాక్టర్ నమూనా'(యల్ డబ్ల్యు ఆర్ సాంకేతికత)లో మొదటిది. ఈ అధునాతన రష్యన్ సాంకేతికతతో తయారవుతున్న అణువిద్యుత్కేంద్ర నిర్మాణం 2002 లోనే మొదలయినప్పటికీ, దానికి వ్యతిరేకంగా అనేక ప్రజా సంఘాలు, సంస్థలు చేపట్టిన అణువ్యతిరేక ఉద్యమాల కారణంగా ముందుకు సాగలేక పోయింది.

భద్రత గురించిన అనేక అనుమానాలు, ఆరోపణల మధ్య ఈ కేంద్రపు మొదటి రియాక్టర్ 2013 జులైలో పని ప్రారంభించింది. దీని నిర్మాణానికి 18,000 కోట్ల రూపాయలు అవుతుందని అంచనా.

సర్దార్ సరోవర్ ఆనకట్ట

మన దేశంలో అన్ని నదులూ తూర్పు దిక్కుకు ప్రవహిస్తుంటే, నర్మద-తపతి అనే రెండు నదులు మాత్రం పడమటి దిక్కుకు ప్రవహిస్తున్నాయి. వీటిలో నర్మద నది మీద కడుతున్న 30 ఆనకట్టల్లో అతి పెద్దది, సర్దార్ సరోవర్ ఆనకట్ట. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని మొత్తం 18,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతానికి నీరు అందించగల ఈ ఆనకట్ట ఎత్తు మొదట్లో 80 మీ. ఉంచాలనుకున్నారు. తర్వాత ఆ ఎత్తును పెంచి పెంచి, ప్రస్తుతం పునాదులనుండి 163 మీ. ఉంచబోతున్నారు. అలా ప్రపంచంలోని అతి పెద్ద కాంక్రీటు ఆనకట్టల్లో ఇది రెండవది

కానున్నది.




ఆనకట్ట ఎత్తును పెంచిన కొద్దీ రిజర్వాయరులోని నీళ్ళు మరిన్ని ప్రాంతాలను ముంచివేస్తాయి. సర్దార్ సరోవర్ ఎత్తు పెంపు వల్ల ఆ విధంగా అనేక లక్షల ఎకరాల కొండలు, అటవీభూములు, గ్రామాలు పూర్తిగా మునిగిపోనున్నాయి. ఆయా గ్రామాల ప్రజలకు ప్రభుత్వం వారు వేరే ప్రాంతాల్లో భూములు, ఇళ్ళు, ఇతర వసతులు కల్పించి పునరావాసం కల్పిస్తామని హామీలైతే ఇచ్చారు కానీ, మేధాపట్కర్, అరుంధతీ రాయ్ వంటి పర్యావరణ వాదులు ఈ సందర్భంగా అనేక ప్రశ్నల్ని లేవనెత్తి, మన సుప్రీం కోర్టుతో సహా అనేక జాతీయ అంతర్జాతీయ న్యాయస్థానాలను కదిల్చివేశారు. పెద్ద ఆనకట్టల నిర్మాణం పరంగా వారు లేవనెత్తిన ప్రశ్నలు- ముఖ్యంగా ఆ కట్టడాల భద్రత, పర్యావరణ వినాశనం, స్థానిక ప్రజల జీవించే హక్కు, సంస్కృతీ విచ్ఛిన్నత వంటివి, ఈనాటికీ సమాధానం లేని శేష ప్రశ్నలుగా మిగిలి సభ్య సమాజాన్ని నిలదీస్తున్నాయి. ఈ క్రమంలోనే సర్దార్ సరోవర్ నిర్మాణం మరింత ముందుకెళ్తోంది, రిజర్వాయర్లోని జలాలు కాలువల ద్వారా మరిన్ని ప్రాంతాలకు చేరుకొని గుజరాత్ నాయకులకు ఓట్ల పంటను కురిపిస్తూనే ఉన్నాయి.

నోబెల్ ప్రైజు

స్వీడన్ దేశస్థుడైన ఆల్ఫ్రెడ్ నోబెల్ (1833-1896) రసాయన శాస్త్రంలోనూ, ఇంజనీరింగులోనూ గొప్ప ప్రతిభకలవాడు. అతని ఆవిష్కరణల్లో ఒకటైన 'డైనమైటు' అనే ప్రేలుడు పదార్థం అతనికి ఎక్కడలేని డబ్బునూ సంపాదించి పెట్టింది. చివరికి చనిపోయేనాటికి ఆల్ఫ్రెడ్ ఆస్తి, (2008 ధరల్లో) సుమారు 180 మిలియన్ డాలర్లట!

ఆ రోజుల్లో డైనమైటును అనేకమంది హంతకులు మందుగుండుగా వాడుకునేవారు. ఆల్ఫ్రెడ్

నోబెల్ సోదరుడు లుడ్విగ్ 1888లో చనిపోయే సమయానికి, చాలామంది ఇతనే చనిపోయాడనుకున్నారు. 'మరణపు వ్యాపారి మృతి' అంటూ ఫ్రెంచి పత్రికలు వార్తలు కూడా రాసాయట! అవి చదివాక ఆల్ఫ్రెడ్ ఆలోచనల్లో మార్పు వచ్చింది. తన వ్యాపారంలోని అనైతికతకు అతడు కొంచెం నొచ్చుకున్నట్లు తోస్తుంది.



అందువల్లనే కావచ్చు, చనిపోయే ముందు అతను తన యావదాస్తినీ పెట్టుబడిగా ఉంచి, దానిపై వచ్చే వడ్డీని ఏ ఏటికాయేడు 'భౌతిక శాస్త్రం; రసాయన శాస్త్రం; వైద్య శాస్త్రం; సాహిత్యం; ప్రపంచ శాంతి'- అనే ఐదు రంగాల్లోనూ మానవాళి శ్రేయస్సుకోసం విశేష కృషి చేసిన వారికి బహుమతిగా ఇవ్వాలని నిర్దేశించాడు.

ఈసారి నోబెల్ శాంతి బహుమతికై పదిహేడు సంవత్సరాల పాకిస్తాన్ యువకెరటం 'మలాలా యూసుఫ్‌జాయ్', మన దేశంలో బాలల హక్కుల కోసం విశేష కృషి చేసిన 'కైలాష్ సత్యార్థి' ఎంపికయ్యారు. నోబెల్ కమిటీతో సహా అనేక అంతర్జాతీయ సంస్థల గుర్తింపువల్ల వీరి కృషికి మరింత ప్రామాణికత లభించనున్నది. బాలల హక్కుల ఉద్యమానికి ఇది గొప్ప చేయూత కానున్నది కూడాను.

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు.

పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. సాయం చేయండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం !

వెలల పట్టిక:

	వ్యక్తులు	**సంస్థలు**
విడి ప్రతి వెల (పోస్టేజీ అదనం)	**25** రూ.	**25** రూ
సంవత్సర చందా (సాధారణ పోస్టు)	**300** రూ.	**350** రూ.

సంవత్సర చందాను మనిఆర్డరు/బ్యాంకు ట్రాన్సుఫరు ద్వారా చెల్లించవచ్చు. **దయచేసి మీ చిరునామాను పోస్టు / యస్సెమ్మెస్ / ఇ-మెయిలు ద్వారా విడిగా తెలియజేయండి.** పుస్తకాలను సాధారణ పోస్టులో పంపుతాం, రచయితలు, చిత్రకారులు దయచేసి తమ రచనలను పోస్టు / ఇమెయిలు రూపంలో పంపగలరు. పిల్లల చేత పాడించిన చక్కని పాటల ఆడియోలనూ మాకు పంపండి. పిల్లలకు ఉపయోగకరంగా ఉండేవాటిని తప్పక ప్రచురిస్తాం!

బ్యాంకు ట్రాన్సుఫరు కోసం అక్కౌంటు వివరాలు:
Kottapalli Prachuranalu,
S.B. A/c No: 62320333310
SBH- Dharmavaram Branch,
ISFC code: SBHY0020902

కొత్తపల్లి ప్రచురణలు

1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర,
చెన్నేకొత్తపల్లి- 515101
అనంతపురం జిల్లా
ఫోను: 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in
వెబ్‌సైటు: http://kottapalli.in

కొత్తపల్లికో సంవత్సర చందా

మిత్రుడు సుబ్బారావు చాలా మంచివాడు. గొప్ప పుస్తక ప్రియుడు. "కవితలు చాలా బాగుంటాయిరా, కానీ ఎందుకనో యీ కాలం పిల్లలెవ్వరూ కవితల పుస్తకాన్ని అంతగా చదవట్లేదు" అన్నాడోసారి.

"నిజమే ఒకప్పుడు తిలక్ "అమృతం కురిసిన రాత్రి" అంటేనూ శ్రీశ్రీ "మహాప్రస్థానం" అంటేనూ తెలుగు జనాలు తెగమెచ్చుకునేవాళ్ళు. యీ మధ్య అంతగా నచ్చిన కవితా సంపుటాలు అరుదు" అన్నాన్నేను.

"కవితల వరకూ ఎందుకు? పద్యాలూ అంతే. ఇదివరకు పిల్లలంతా ఎక్కాల పుస్తకాలు కొన్నట్లు వేమనశతకం, సుమతీ శతకం కొనుక్కునేవాళ్లా? ఇప్పుడు ఎవ్వరూ వాటి ఊసే ఎత్తట్లేదు" అన్నాడు సుబ్బారావు.

"వాటిని నేర్పే శక్తి, ఆ ఇష్టం ఉన్న తెలుగు మాస్టార్లూ ఉండాలి కదా. పాపం పిల్లలదేమున్నది, పెద్దలెట్లా అంటే అట్లా తలలూపుతారు" అన్నాన్నేను.

"మరి కథల పరిస్థితీ అదే కద! ఎంత మంచి కథలైనా, చదివేవాళ్లేరీ? పిల్లల్లో చదివేశక్తి పూర్తిగా తగ్గిపోయింది" అన్నాడు సుబ్బారావు, ముఖం బాధగా పెట్టి.

"అదేం లేదు. మంచి కథలు, పిల్లలకి అర్థమయ్యే పదాలు, వాళ్లు మెచ్చే అంశాలు ఉండే కథలు, చక్కని కాగితం మీద, రంగురంగుల బొమ్మల్తో వస్తే, పిల్లలు ఇష్టంగానే చదువుతారు. అయితే ఇందులో ఓ కిటుకున్నది-" ఆపాను నేను-

"ఏంటది?" అడిగాడు సుబ్బారావు.

"ఎంతమంచి పుస్తకాలైనా, పిల్లలమీద ఒక్కసారిగా పడెయ్యకూడదు-చిన్న చిన్న డోసుల్లో, కొద్ది కొద్దిగా రుచి చూపిస్తూ పోవాలి. పుస్తకాల్ని నెల నెలా తెప్పించుకుంటే లాభం అదే. నెలంతా తీరిక ఉండి ఇష్టం కుదిరినప్పుడు చదువుతారు కద, పిల్లలు? తర్వాతి పుస్తకం వచ్చేలోగా యీ నెల పుస్తకాన్ని మూడు మూడు సార్లు చదివేస్తారు! ప్రయత్నించి చూడు మీ పిల్లల్తో కూడా!" అన్నాన్నేను.

"అయితే కొత్తపల్లికో సంవత్సర చందా రాసుకో మరి! నెలనెలా వస్తుందిగా?" అన్నాడు సుబ్బారావు, మూడు వందల రూపాయలు జేబులోంచి తీస్తూ.

Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu and printed at Mudrica Offset Printers, Vijayawada and published at "Kottapalli", 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma